ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

గురువారం 31 జూలై 2025

కాంప్లెక్స్ కొంటేనే.. యూరియా..!

రైతు సేవాకేంద్రాల్లో అందుబాటులో లేని ఎరువులు

కృత్రిమ కొరత సృష్టిస్తున్న దుకాణదారులు

కాంప్లెక్స్ ఎరువులు కొనాలంటూ షరతులు

తలలు పట్టుకుంటున్న అన్నదాతలు





బోరుబావి కింద సాగుచేసిన మొక్కజొన్న పంట

చిలమత్తూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): పదును వర్షం లేదు. అరకొర తేమలోనే పంటలు వేశారు. వేలు, లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టారు. చినుకు జాడలేకపోవడంతో పంట పండుతుందో.. లేదోనని అన్నదాత నిద్రలేని రాత్రులు గడుపుతున్నాడు. ఈ పరిస్థితుల్లో విత్తిన పంటకు యూరియా వేద్దామంటే దొరకట్లేదు. తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయనీ, యూరియాకు డిమాండ్ ఉండదని అధికారులు రైతు సేవాకేంద్రాలకు తెప్పించలేదు. దీనిని ఎరువులు దుకాణదారులు క్యాష్ చేసుకుంటున్నారు. యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. యూరియా కావాలంటే కాంప్లెక్స్ ఎరువు కొనాల్సిందేనని కండీషన్ పెడుతున్నారు. అలా.. రూ.250 యూరియా బస్తా అవసరం కాగా.. రూ.1650 విలువైన కాంప్లెక్స్ కొనాల్సిన దుస్థితిని రైతులకు కల్పిస్తున్నారు. పంట పండుతుందో.. లేదోనన్న ఆందోళనలో ఉన్న తమను ఇలా దోపిడీ చేయడం ఏంటని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

రైతు సేవాకేంద్రాలకు చేరని నిల్వలు

డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని గ్రామ సచివాలయాల్లోని రైతు సేవాకేంద్రాలకు రసాయన ఎరువుల నిల్వలు చేరుకోవాల్సి ఉంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా అధికారులు ఎరువులను తెప్పించేందుకు ఆలోచిస్తున్నారు. దీనిని ఎరువుల దుకాణదారులు ఆసరాగా చేసుకుంటున్నారు. యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. వెరసి ఇప్పటికే విత్తుకున్న మొక్కజొన్న, వేరుశనగతో పాటు ఇతర పంటలకు యూరియా అందించడం రైతులకు సమస్యగా మారింది.

కాంప్లెక్స్ ఎరువుతో లింక్

రైతు సేవాకేంద్రాల్లో ఎరువులు అందుబాటులో (మిగతా 6లో..)

గుత్తి రోడ్డులోని డంపింగ్ యార్డు కొండలా మారిపోయింది.
ఇప్పటికే లక్షల టన్నుల చెత్త ఉంది.
అది రోజూ పెరుగుతూనే ఉంది.
దుర్వాసనతో ఆ ప్రాంతవాసులు సతమతమవుతున్నారు.
రోడ్డుపైకి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే.
ఏళ్లుగా సమస్య అలానే ఉంది.
తరలిద్దామంటే చుట్టుపక్కల ప్రాంతాల వారు అభ్యంతరం చెబుతున్నారు.
తమ ప్రాంతంలో వద్దంటూ ఉద్యమాలు చేస్తున్నారు. ఎన్నో వివాదాలు తలెత్తాయి.
పరిష్కారం లేదనుకున్న సమస్యపై కూటమి ప్రభుత్వం చొరవ చూపింది.
కోట్లు ఖర్చు పెట్టి కొండలా పేరుకుపోయిన చెత్త దిబ్బను కరిగిస్తోంది.
అధునాతన యంత్రాలతో ఆ ప్రాంతాన్ని ఖాళీ చేస్తోంది.

డంపింగ్ యార్డులో బయోమైనింగ్ చేస్తున్న మిషన్లు





దిబ్బ కరుగుతోంది..!

డంపింగ్ యార్డులో 1.68లక్షల టన్నుల చెత్త

- రోగాలతో నగరవాసులు సతమతం
- తరలించాలని ఏళ్లుగా డిమాండ్
- సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చొరవ
- అధునాతన యంత్రాలతో బయో మైనింగ్
- అక్టోబరు 2 నాటికి పూర్తి చేయడమే లక్ష్యం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా వివాదాలు, అక్రమాలకు నిలయంగా మారిన అనంత డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం లభిస్తోంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అనంత ప్రజలకు డంపింగ్ యార్డుతో ముడి పడి ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. అనేకమార్లు వైసీపీ ప్రభుత్వం డంపింగ్ యార్డును ఇతర ప్రాంతాలకు మార్చాలని తలంచినా అమలుకు నోచుకోలేదు. నగరపాలక సంస్థ, రాష్ట్ర స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులకు అనంత వాసులు పలుమార్లు సమస్య పరిష్కరించాలని విన్నవించుకున్నారు. ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు.

కూటమి పాలకుల దృష్టి

అనంత డంపింగ్ యార్డు సమస్యపై కూటమి పాలకులు దృష్టి పెట్టారు. ఎలాగైనా సమస్యను పరిష్కరించాలని నిర్ణయించుకున్నారు. ఆ మేరకు తమిళనాడులోని ఈరోడ్‌కు చెందిన జిగ్మా సంస్థకు బయోమైనింగ్ చేయడానికి కాంట్రాక్టు ఇచ్చారు. దీంతో జిగ్మా సంస్థ ఇప్పటికే బయోమైనింగ్ పనులు ప్రారంభించింది. మొత్తం మూడు అధునాతన యంత్రాలతో చెత్తను వేరుచేసే ప్రక్రియను ప్రారంభించింది. ప్రస్తుతం డంపింగ్ యార్డులో ఉన్న 1.68 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెస్ చేస్తారు. కొత్తగా రోజుకు 150 టన్నుల చెత్త యార్డుకు చేరుతోంది. నెలకు 4,500 టన్నులు అటే రెండు నెలలకు 9వేల టన్నులు యార్డుకు తరలించనున్నారు. పాత చెత్త బయోమైనింగ్ పూర్తయిన వెంటనే కొత్తగా వచ్చే దానిని ప్రాసెస్ చేయనున్నారు.

సీసీ కెమెరాల్లో రికార్డు

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు డంపింగ్ యార్డు బయోమైనింగ్ బాధ్యతలు అప్పగించారు. అనంత నగరపాలక సంస్థ అధికారుల పర్యవేక్షణ, సీసీ కెమెరాల నిఘా నీడలో బయోమైనింగ్ పనులు చేపడుతున్నారు. అక్టోబరు 2వ తేదీనాటికి డంపింగ్ యార్డును పూర్తిగా ఖాళీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. టిప్పర్లలో ఖాళీగా మొదట బరువును చూసి, చెత్త ఎత్తిన తరువాత తూకం వేసి ఫొటో క్యాప్చర్ చేస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారుల లెక్కల ప్రకారం యార్డులో ఉన్న 1.68 లక్షల టన్నుల చెత్తను బయోమైనింగ్ చేయడానికి పబ్లిక్ హెల్త్, అనంత నగరపాలక సంస్థ అధికారుల పర్యవేక్షణలో జిగ్మా సంస్థకు (మిగతా 6లో)



కొత్తగా వచ్చిన వారియర్-2100 మిషన్

ఐదు యంత్రాలతో బయోమైనింగ్

డంపింగ్ యార్డులో మొదట మూడు అధునాతన యంత్రాలతో బయోమైనింగ్ ప్రారంభించారు. ఎక్స్‌టెక్-ఎక్స్5 మిషన్ గంటకు 100-120 మెట్రిక్ టన్నుల చెత్తను బయోమైనింగ్ చేస్తుంది. మరో మిషన్ వారియర్-1400 గంటకు 80-100 టన్నులు, వారియర్-2100 గంటకు 200-220 టన్నులు ప్రాసెసింగ్ చేస్తుంది. మరో రెండు మిషన్లు రెండు, మూడు రోజుల్లో రానున్నాయి. చెత్తను ప్రాసెస్ చేసి మూడు భాగాలుగా మార్చేస్తాయి. ఈ మట్టి ఎరువును రైతులకు ఉచితంగా ఇవ్వాలా, నామమాత్రపు ధరను వసూలు చేయాలా అనే దానిపై ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, జూలై 30(ఆంధ్రజ్యోతి): రీ సర్వే, పౌర సరఫరాలు, పీజీఆర్ఎస్, చుక్కల భూములు తదితర పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలని ఆదేశించారు. ఎంఎల్ఎస్ పాయింట్లను ఆర్డీఓలు, ఎఫ్‌పీ షాపులను తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు తప్పనిసరిగా తనిఖీ చేయాలని ఆదేశించారు. రీసర్వే పనులను గడువులోపు పూర్తిచేయాలన్నారు. జిల్లాలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు పనులను సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. గుంతకల్లు, పుట్లూరు, కుందుర్పి, యల్లనూరు, కూడేరు మండలాల్లో ప్లాంట్‌లు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో బయోగ్యాస్ ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని, సోలార్ పవర్ ప్రాజెక్టులకు ఆ శాఖ అధికారులకు సహకరించాలని సూచించారు. సమావేశంలో డీఆర్ఓ మలోల, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, సర్వే ఏడీ రూప్లానాయక్, కో ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యోగేశ్వరి దేవి, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లకు రూ.124.99 కోట్లు

జిల్లావ్యాప్తంగా 2,80,811 మంది లబ్ధిదారులకు రూ.124.99 కోట్ల పింఛన్ పంపిణీ చేయనున్నామని ఇన్‌చార్జి కలెక్టర్ తెలిపారు. పింఛన్ల పంపిణీపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఒకటో తేదీ ఉదయం 7గంటల నుంచే పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు.

ఏమైంది వీరికి..!

- కార్యకర్త బలైనా పట్టని నాయకులు
- దిక్కుతోచని స్థితిలోనే నవీన్ ఆత్మహత్య



పోలీసుల ఎదుటే చెప్పుతో కొట్టిన మహిళ

స్టేషన్ ఎదుట దాడి చేసిన సర్పంచ్ మనవడు

అధికారం లేకపోయినా..

వైసీపీ నాయకుల పెత్తనం



కదిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త నవీన్ ఆత్మహత్య అనేక ప్రశ్నలను సంధిస్తోంది. అధికారంలో ఉన్న ఓ పార్టీ కార్యకర్తను పోలీసులు అమానుషంగా కొట్టినా స్థానిక నాయకత్వం పట్టించుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. అధికారం కోల్పోయిన ఓ పార్టీ నాయకులు చెప్పిందల్లా పోలీసులు చేయడం, ఒక ప్రాణం పోయినా వారిపై ఎలాంటి చర్యలు లేకపోవడం చర్చనీయాంశమైంది. 'మనది బీసీల పార్టీ అని చెప్పుకుంటారు కదా..? పెత్తందారులు మా బిడ్డను బలితీసుకున్నా గట్టిగా ప్రశ్నించడంలేదేం..?' అని బాధితులు లోలోన కుమిలిపోతున్నారు. దొంగతనం నేరం మోపి, టీడీపీ కార్యకర్త నవీన్ ఆత్మహత్యకు వైసీపీ సర్పంచ్ సుగుణమ్మ కారణమయ్యారని పోలీసులు కేసు నమోదు చేశారు. అదే పోలీసులు.. సుగుణమ్మ కుటుంబం చేసిన ఫిర్యాదు ఆధారంగా నవీన్‌ను చిత్రహింసలు పెట్టారని అతని సెల్ఫీ వీడియో చెబుతోంది. చైన్ కొట్టేశాడని ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేయొచ్చు. చైన్ రికవరీ కోసం కాస్త గట్టిగానే అడగొచ్చు. కానీ నవీన్ బైకులో చైన్ దొరికిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినా నవీన్‌ను ఎస్ఐ ఎందుకు చితకబాదినట్లు..? నేరం అంగీకరించాలని ఎవరి కోసం ఒత్తిడి చేసినట్లు..? ఇంత (మిగతా 6వ పేజీలో...)

ఇంటర్‌లో ఉత్తీర్ణత పెంచాలి: ఆర్జేడీ

అనంతపురం విద్య, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో గతేడాదికన్నా మెరుగైన ఫలితాలు తీసుకురావడానికి కృషి చేయాలని ప్రిన్సిపాల్, లెక్చరర్లను ఆర్జేడీ సురేష్‌బాబు ఆదేశించారు. జిల్లా కేంద్రానికి బుధవారం వచ్చిన ఆయన కేఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలను పరిశీలించారు. విద్యా బోధనపై విద్యార్థులతో ఆరా తీశారు. అనంతరం ప్రిన్సిపాల్, లెక్చరర్లతో సమావేశం నిర్వహించారు. ఉత్తమ ఫలితాల కోసం ఇప్పటి నుంచి ప్రణాళికాబద్ధంగా ముందుకుపోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారందరూ పరీక్షలలో పాసయ్యేలా తీర్చిదిద్దాలన్నారు. కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాయనని ఆర్జేడీ హామీఇచ్చారు. సమావేశంలో డీబీఈఓ వెంకటరమణనాయక్, ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ, లెక్చరర్లు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓల నియామకం

అనంతపురం విద్య, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంఈఓలు లేని మండలాలకు ఇన్‌చార్జ్‌లను నియమించారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈఎంఈఓ పోస్టులకు గవర్నమెంట్‌స్కూల్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకే అవకాశం కల్పించారు. కుందుర్పి ఎంఈఓ-2గా శంకరన్న(రాయదుర్గం గవర్నమెంట్ హైస్కూల్ (గ్రేడ్-2 హెచ్‌ఎం), డి.హీరేహాళ్ ఎంఈఓ-1గా వేణుగోపాల్‌రావు(గుంతకల్, ఎస్‌జేపీ గవర్నమెంట్ హైస్కూల్,పీడీ), కంబదూరు ఎంఈఓ-1గా బీ.ఉమాపతి,(అనంతపురం గవర్నమెంట్ హైస్కూల్, స్కూల్‌అసిస్టెంట్ ఇంగ్లిష్), గుమ్మఘట్ట ఎంఈఓ-1గా పి.సోమశేఖర(కళ్యాణదుర్గం, కేసీ గవర్నమెంట్ హైస్కూల్, స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్)లను నియమించారు. ఈమేరకు ఆర్జేడీ శామ్యూల్ అదికారికంగా ఉత్తర్వులు ఇచ్చారు.

అంధటీచర్లకూ ముఖ హాజరు తప్పనిసరి

(7లో...)

ఉచిత గ్యాస్ కొందరికేనా..?

చాలామందికి జమకాని సొమ్ము

నేటితో ముగియనున్న రెండో విడత గడువు

లబ్ధిదారులకు తప్పని నిరీక్షణ

పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబరు 1967



ధర్మవరం/కొత్తచెరువు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ పథకం జిల్లాలో ఇంకా చాలామందికి వర్తించట్లేదు. 40 శాతం వరకు లబ్ధిదారులు ఉచిత గ్యాస్ సొమ్ము కోసం వేచిచూస్తున్నారు. డబ్బులు జమ కాలేదంటూ బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. జమవుతుందని చెప్పి వారు పంపుతున్నారు. జిల్లాలో 5,72,289 సబ్సిడీ కనెక్షన్లున్నాయనీ, ఇందులో 5,61,916 ఈకేవైసీ పూర్తయ్యాయని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఈలెక్కన ఇంకా 10,373 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. 5,72,289 గ్యాస్ కనెక్షన్లకుగాను మొదటి విడతలో 3,21,612 మందికి రూ.26.84 కోట్లు ఖాతాల్లోకి జమైంది. 2,50,677 మందికి జమకావాల్సి ఉంది. మొదటి విడత డబ్బులు రాకుంటే మిగతా రెండు విడతల సబ్సిడీ డబ్బులు వస్తాయో..

(మిగతా 6వ పేజీలో...)

పార్టీ బలోపేతానికి కృషి

- రాయలసీమను అభివృద్ధికి చిరునామాగా మారుస్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్
- నగరంలో భారీ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై30(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ... ప్రతి కార్యకర్తకు అండగా నిలబడతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. రాయలసీమ పర్యటనలో భాగంగా ఆయన చేపట్టిన యాత్ర బుధవారం అనంతపురం చేరింది. ఉదయం హౌసింగ్‌బోర్డులోని చాయ్ పే.. చర్చలో పాల్గొన్న మాధవ్ రాయలసీమ అభివృద్ధిపై స్థానిక మేధావులు, ప్రజలు, కార్యకర్తలతో మాట్లాడారు. అనంతరం అశోక్‌నగర్‌లోని ఎర్రమల కొండప్ప విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కృష్ణకళామందిరం నుంచి చేపట్టిన భారీ శోభాయాత్ర టవర్‌క్లాక్, సుభాష్‌రోడ్డు, సప్తగిరి సర్కిల్ మీదుగా లలితకళాపరిషత్తు వరకు సాగింది. లలితకళాపరిషత్తులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లాస్థాయి విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమల (మిగతా 6లో..)

సైలెన్సర్లు తుక్కు తుక్కు

రోలర్‌తో తొక్కించిన పోలీసులు



క్లాక్‌టవర్ వద్ద రోలర్‌తో తొక్కిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం, జూలై30(ఆంధ్రజ్యోతి): సైలెన్సర్ల మోతపై పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. స్థానిక క్లాక్‌టవర్ వద్ద బుధవారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అధిక శబ్దం చేసే వాహనాల నుంచి సేకరించిన సైలెన్సర్లు, హారన్లను రోలర్‌తో తొక్కించారు. ఎస్పీ జగదీష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... నగరంలో ప్రత్యేక డ్రైవ్ ద్వారా సేకరించిన సుమారు 150 వరకు టూవీలర్ల సైలెన్సర్లు, 300 ఆటోల హారన్లను తొక్కించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. అధిక శబ్దం చేసే సైలెన్సర్లు టూవీలర్లకు బిగించుకుని రోడ్లపైకి వస్తే... యజమానికి 3 నెలల జైలు, రూ.10వేల జరిమానా తప్పదనీ, మూడు నెలల పాటు లైసెన్సు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. వాహనాలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తే... ప్రత్యేక లాక్ వేస్తామన్నారు. బైక్ రైడర్ల అధిక వేగానికి ఎలా కళ్లెం వేస్తారని 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా.. ఎస్పీ స్పందిస్తూ... నగరంలోని, బైపాస్ ప్రాంతాల్లో తిరిగే బైక్ రైడర్స్‌పై దృష్టి పెడుతామన్నారు. కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు, టూటౌన్ సీఐలు శ్రీకాంత్ యాదవ్, 3వ పట్టణ సీఐ శాంతిలాల్, 4వ పట్టణ సీఐ జగదీష్, ఎస్ఐలు ప్రసాద్, రుష్యేంద్రబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ

నిండిన జీడిపల్లి

- ఆరు రోజుల్లోనే మరువ పారిన రిజర్వాయరు

(వివరాలు 7లో..)



శక్తిస్వరూపిణి

- అతివలకు అండగా శక్తి టీమ్స్ (7లో...)

(5వ పేజీ తరువాయి)

జరుగుతున్నా, నవీన్‌కు అండగా టీడీపీ నుంచి ఏ ఒక్క నాయకుడూ స్టేషన్ వద్దకు వెళ్లలేదు. అదే వైసీపీ నుంచి ఓ వర్గం మొత్తం స్టేషన్‌కు వెళ్లింది. దగ్గరుండి దాడి చేయించిందని బాధితుడు తన ఆఖరి మాటల్లో ఆవేదన వ్యక్తం చేశారు.

వైసీపీ పోలీస్..!

రాజనోళ్లపల్లిలో నవీన్ తన బంగారు గొలుసు లాక్కెలాడని సర్పంచ్ సుగుణమ్మ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. నవీన్‌ను సర్పంచ్ ఇంటి వద్దే ఆపి తనిఖీ చేశారు. కానీ చైన్ దొరకలేదు. కానీ బైక్‌ను అక్కడే వదిలేసి వెళ్లిపోవాలని నవీన్‌కు సూచించారు. నవీన్ వెళ్లిపోయిన తరువాత బైక్‌లో చైన్ దొరికిందని తేల్చారు. ఈ కోణంలో పోలీసులు ఎందుకు ఆలోచించలేదు..? పోలీసులు నవీన్‌ను తీసుకువెళుతున్న సమయంలో అక్కడున్న వైసీపీ నాయకులు దాడి చేశారు. ఓ మహిళ నవీన్‌ను చెప్పుతో కొట్టిందని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. తలుపుల పోలీస్ స్టేషన్‌కు ఎదుట సుగుణమ్మ మనవడు నవీన్‌పై పోలీసుల ఎదుటే దాడిచేశాడని సమాచారం. ఆ సమయంలో వైసీపీవారు సుమారు 20 మంది స్టేషన్‌కు వచ్చి, నవీన్‌పై కేసు నమోదు చేయాలని ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. దర్జాగా స్టేషన్‌లో కూర్చుని, పోలీసులను రెచ్చగొట్టి తనపై దాడి చేయించారని నవీన్ తన సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. నిస్సహాయ స్థితిలో అధికార పార్టీ కార్యకర్త బలవన్మరణానికి పాల్పడటం అందరినీ ఆలోచనలో పడేసింది.

పట్టించుకోరా..?

పార్టీ కార్యకర్త ఆత్మహత్య చేసుకున్న తరువాత కూడా టీడీపీ స్థానిక నాయకులు పెద్దగా పట్టించుకోలేదు. జిల్లా నాయకత్వం నుంచి కూడా ఆశించిన స్పందన లేదు. నవీన్ సెల్ఫీ వీడియో చూస్తే ఎవరికైనా కన్నీరు వస్తుంది. జరిగిన అవమానాన్ని తలచుకుని రాత్రంతా భార్య వద్ద,

ఏమైంది వీరికి..!

కుటుంబ సభ్యుల వద్ద ఏడ్చిన నవీన్.. ఉదయాన్నే ఉరి వేసుకున్నాడు. అంతకు ముందు తన సోదరికి సెల్ఫీ వీడియో పెట్టాడు. 'నమ్ముతారో నమ్మరో..? ఏం జరిగిందో ఏమో..?' అంటూ.. నిస్సహాయ స్థితిని కళ్లకు కట్టాడు. అతని కళ్లలో నీటి ధార స్పష్టంగా కనిపిస్తోంది. అయినా పార్టీ నేతల్లో కదలిక రాకపోవడం చర్చనీయాంశమైంది. సాధారణంగా అధికార పార్టీలో ఉన్నవారు తప్పు చేసినా పార్టీ నాయకులు వెనకేసుకొస్తారు. పోలీసులు సైతం దూకుడుగా వెళ్లరు. కానీ నవీన్ విషయంలో పూర్తి భిన్నంగా జరిగింది. చైన్ స్నాచింగ్ వ్యవహారమే అనుమానాస్పదంగా ఉంది. అయినా బాధిత కార్యకర్తకు అండ కరువైంది. దిక్కుతోచక అతను కనుమరుగైపోయాడు. ఇంత జరిగినా పార్టీ పరంగా గట్టిగా ఎవరూ ప్రశ్నించడం లేదు. కదిరి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం జరుగుతుండగా కొందరు నాయకులు చుట్టపుచూపుగా వెళ్లి పరామర్శించారు.

కన్నీటి సంద్రం

పోస్టుమార్టం అనంతరం నవీన్ మృతదేహాన్ని మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. నవీన్ భార్య కన్నీరుమున్నీరయ్యారు. ఏడాదిన్నర వయసు బిడ్డ ఉన్న ఆమె భవిష్యత్తు ఏమిటో అర్థంగాని పరిస్థితి. కాగా, ఈ కేసులో సుబ్బారెడ్డి, రఘునాథరెడ్డి అనే ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని సీఐ నాగేంద్ర తెలిపారు.

వేధింపులతోనే ఆత్మహత్య

అనంతపురం క్రైం: వైసీపీ నాయకులు, పోలీసులు వేధింపుల వల్లే తలుపుల మండలం రాజనోళ్లపల్లికి చెందిన నవీన్ ఆత్మహత్య చేసుకున్నాడని వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. అనంతపురంలోని జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచెపు వెంకటేషులు, శ్రీసత్యసాయి జిల్లా ఉపాధ్యక్షుడు సిమెంట్ పోలన్న బుధవారం మీడియాతో మాట్లాడారు. నేరం చేయకున్నా స్టేషన్‌కు పిలిపించి వేధించారని అన్నారు. సంఘటన జరిగి 48 గంటలు గడిచినా బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. పోలీసులు వడ్డెర్లను చిన్నచూపు చూస్తున్నారని, అగ్రవర్ణాలపై ప్రత్యేక ప్రేమ చూపుతున్నారని విమర్శించారు.


విలేకరులతో మాట్లాడుతున్న పోలన్న ఇతర నాయకులు

పోలీసు శాఖ ఉన్నతాధికారులు స్పందించి, ఎస్‌ఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మంజునాథ్, సుధాకర్, రామ్మోహన్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ కొంటేనే.. యూరియా..!

(5వ పేజీ తరువాయి)

లేకపోవడంతో ప్రైవేటు దుకాణాల్లో విక్రయాలకు కాంప్లెక్స్ ఎరువుతో లింక్ పెట్టారు. యూరియా కావాలంటే కాంప్లెక్స్ ఎరువు కూడా కొనుగోలు చేయాలని ఆంక్షలు విధిస్తున్నారు. యూరియా బస్తా కావాలంటే.. అంతే స్థాయిలో కాంప్లెక్స్ ఎరువు కొనాల్సిందే. లేదంటే యూరియా ఇవ్వడం కుదరదని చెప్పేస్తున్నారు. కర్ణాటకలోని బాగేపల్లిలో మరో అడుగు ముందుకేసి యూరియా బస్తా కావాలంటే దానికి తోడుగా పురుగుల మందు, కాంప్లెక్స్ ఎరువు కొనాల్సిందేనని లింక్ పెడుతున్నారు. దీంతో యూరియా కొనాలా.. వద్దా.. అనే సందిగ్ధంలో రైతులు ఉండిపోతున్నారు.

పడిగాపులు కాస్తున్నాం: అశ్వత్థరెడ్డి, మరవకొత్తపల్లి రైతు



పంటలకు వేద్దామంటే యూరియా దొరకవడం లేదు. ఎక్కడికి వెళ్లినా నోస్టాక్ అంటున్నారు. ఎక్కడైనా ఉంటే అక్కడ యూరియాతోపాటు కాంప్లెక్స్ ఎరువు కొనాలని నిబంధనలు పెడుతున్నారు. బాగేపల్లిలో యూరియా దొరుకుతున్నా.. అక్కడ కాంప్లెక్స్‌తోపాటు పురుగుల మందులు కూడా కొనాలని ఆంక్షలు పెడుతున్నారు. రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా చేయాలి.

యూరియా తెప్పిస్తున్నాం



రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ ఎరువులను ఒకట్రెండు రోజుల్లో తెప్పిస్తున్నాం. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ఎరువులు అడగలేదు. దాంతో తెప్పించడం కొంత ఆలస్యమైంది. ప్రైవేటు దుకాణాల్లో యూరియా కావాలంటే కాంప్లెక్స్ కొనాలనే నిబంధనలు పెట్టినట్లు సమాచారం వచ్చింది. రైతుకు అవసరమైన ఎరువులు మాత్రమే ఇవ్వాలి. అవసరం లేని వాటిని బలవంతంగా కొనుగోలు చేయిస్తే అటువంటి దుకాణాలపై చర్యలు తీసుకుంటాం.

- కవితారాణి, మండల వ్యవసాయ శాఖ అధికారి, చిలమత్తూరు

పేదల బతుకుల్లో పీ4 వెలుగులు

● మంత్రి సవిత



పెనుకొండ టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పేదల బతుకుల్లో పీ 4 వెలుగులు నింపుతుందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. పీ4తో పేదరికం నుంచి వేల కుటుంబాలు బయటపడతాయన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పాఠశాల యాజమాన్యం, వ్యాపారులతో బుధవారం పీ4 అమలుపై సర్వే నిర్వహించారు. ఎవరెవరు ఎన్ని కుటుంబాలను దత్తత తీసుకుంటారో తెలపాలన్నారు. ఒక్కో ప్రైవేట పాఠశాల తరపున పది కుటుంబాలను దత్తత తీసుకుంటామని యాజమాన్యాలు ప్రకటించాయి. పట్టణానికి చెందిన కృష్ణమూర్తి, షౌకత్ రెండు చొప్పున, శ్రీరాములు ఐదు కుటుంబాలను దత్తత తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నర్సింగప్ప, ఆర్డీఓ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

అట్రాసిటీపై కౌంటర్ కేసులను రద్దు చేయాలి

మహాధర్నాలో ప్రజాసంఘాల నాయకుల డిమాండ్


మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం వైద్యం, జూలై30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై కౌంటర్ కేసులు నమోదు చేసే చట్టాన్ని రద్దు చేయాలని దళిత, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు.. డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని కోరుతూ.. బుధవారం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నెరమెట్ల యల్లన్న అధ్యక్షతన అంబేడ్కర్ విగ్రహం వద్ద మహాధర్నా చేపట్టారు. ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర, ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్, సంఘాల నాయకులు కుంటిమద్ది ఓబులేసు, చిన్నపెద్దన్న, తిరుపాలు, బండారు కుళ్లాయప్ప మాట్లాడారు. అట్రాసిటీ చట్టాన్ని నీరుగార్చేలా బాధితులపైనే కౌంటర్ కేసులు పెట్టే సంస్కృతిని అమలు చేయడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి, కౌంటర్ కేసుల్లేకుండా పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి

(5వ పేజీ తరువాయి)

స్థాపన, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇక్కడి వనరులను సద్వినియోగం చేసుకుని, అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో బీజేపీ చేపట్టిన వారధి కార్యక్రమాన్ని జిల్లాల్లోనూ అమలు చేసి ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తమ సమస్యలను తెలియజేసేలా చేపడతామన్నారు. అనంతలో భారీ స్టేడియాన్ని నిర్మించి, క్రీడాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని సీట్లు గెలిచి, పార్టీకి కానుకగా ఇస్తామని తెలిపారు. సాయంత్రం ఓ హోటల్‌లో నిర్వహించిన మేధావుల సదస్సులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి బిట్రా వెంకట శివనారాయణ, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు సందిరెడ్డి శ్రీనివాసులు, చిరంజీవిరెడ్డి, అంకాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ రఫీ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, నేతలు లలిత్ కుమార్, వెంకటేశ్వరరెడ్డి, మల్లారెడ్డి, ఆవుల చక్రధర్ యాదవ్, నాగేంద్ర, శ్రీదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

నేడు ఉపాధి సిబ్బందికి శిక్షణ

అనంతపురం అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జియో ట్యాగింగ్, జియో ఫెన్సింగ్ మొబైల్ యాప్ ప్రత్యేక అప్లికేషన్‌పై గురువారం డ్వామా కార్యాలయంలో ఎంపిక చేసిన ఉపాధి హామీ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు డ్వామా పీడీ సలీం బాషా ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే శిక్షణకు ప్రతి మండలం నుంచి ఎంపిక చేసిన ఈసీ, జేఈ, టెక్నికల్ అసిస్టెంట్లు హాజరుకావాలని సూచించారు.

లేఅవుట్ క్రమబద్ధీకరణకు నో..

● 91 దరఖాస్తుల తిరస్కరణ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): లేఅవుట్ల క్రమబద్ధీకరణకు చేసుకున్న 91 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు అనంత నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శిరీష బుధవారం తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబరు 134 ప్రకారం లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్)కు కొన్ని సవరణలు చేశారని తెలిపారు. 2019 నుంచి ఇప్పటి వరకు ఎల్‌ఆర్‌ఎస్‌కు 265 దరఖాస్తులు చేసుకున్నారనీ, వాటిలో 156కి అనుమతి పొందారన్నారు. 91 దరఖాస్తులు తిరస్కరించారనీ, 18 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 2025 జూన్ 30వతేదీలోపు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లు ఈ పథకంలో అర్హత పొందుతాయన్నారు. లేఅవుట్‌లో కనీసం ఒక ప్లాట్ అమ్మి ఉండాలనీ, ఈ ఉత్తర్వుల ప్రకారం 90రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో దాఖలైన దరఖాస్తులను కొత్త సవరణల ప్రకారం పరిష్కరిస్తామన్నారు. వివరాలకు అనంత నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగంలో సంప్రదించాలని కోరారు.

దోబీఘాట్ల అభివృద్ధికి దరఖాస్తులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని దోబీఘాట్ల అభివృద్ధికి రజకులు దరఖాస్తు చేసుకోవాలని రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్ బుధవారం ప్రకటనలో కోరారు. కొత్తగా నిర్మించుకోవడానికి రూ.10లక్షలు, పాతవాటి మరమ్మతులకు రూ.3లక్షల వరకు ప్రభుత్వం ఇస్తుందన్నారు. త్వరలో వాషింగ్ మెషిన్లతో ఆధునిక పద్ధతిలో దోబీఘాట్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. వివరాలకు 9400780883 నంబరులో సంప్రదించాలని కోరారు.

రోడ్ల పనులు వేగవంతం చేయండి


కేంద్రమంత్రి గడ్కరీతో ఎంపీలు అంబికా, బీకే పార్థసారథి

కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన ఎంపీలు

అనంతపురం క్రైం, జూలై30(ఆంధ్రజ్యోతి): అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పలు ప్రాజెక్టు పనులకు ఆమోదం తెలపాలని అనంతపురం, హిందూపురం ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారధి.. కేంద్ర రవాణా, రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. బుధవారం ఢిల్లీలో ఇద్దరు ఎంపీలు.. కేంద్రమంత్రిని కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ... 44వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు వెంటనే ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. శింగనమల క్రాస్ వద్ద వెహికల్ అండర్‌పాస్ నిర్మించాలని కోరారు. మరో ఏడు ప్రాజెక్టులు ముందుకు సాగేలా చర్యలు చేపట్టాలన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుంచి మడకశిర వరకూ రహదారి అభివృద్ధి, ఎన్‌హెచ్-55డీని అనంతపురం నుంచి చిత్రదుర్గ వరకూ పొడిగింపు, ఎన్‌హెచ్-44లో బ్లాక్ స్పాట్స్‌కు పరిహారం, ఎన్‌హెచ్ -67 గుత్తి నుంచి తాడిపత్రి వరకూ పూర్తి చేయడం, నాయనపల్లి నుంచి బత్తలపల్లి వరకూ రోడ్డు అభివృద్ధి, అనంతపురం ఈస్ట్ బైపాస్ ద్వారా ఎన్‌హెచ్ 544డీ నుంచీ ఎన్‌హెచ్ 42 వరకూ రోడ్డు అనుసంధానించాలని కోరారు. యలహంక నుంచి సోమందేపల్లి వరకూ 120 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు. రైతులు, పరిశ్రమలకు ఉపయోగపడే ఈ ప్రాజెక్టులు త్వరితగతిన పట్టాలెక్కేలా చూడాలని కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి వినతిపత్రం అందించారు.

అర్హులందరికీ పక్కాగృహాలు

● మంత్రి కొలుసు పార్థసారథి ● కళ్యాణదుర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం


వాల్మీకి సర్కిల్ అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం, జూలై30(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పట్టాలు ఇచ్చి, పక్కాగృహాలు నిర్మిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుతో కలిసి మంత్రి ప్రారంభించారు. వాల్మీకి సర్కిల్‌లో ఎమ్మెల్యే సొంతనిధులు రూ.50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు, రూ.2.50 కోట్లతో నిర్వహిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ.. బీటీపీ కాలువ పనులు పూర్తి చేసి, అన్నదాతల కళ్లల్లో ఆనందం నింపుతామన్నారు. అనంతరం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ.. ఎవరు, ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కుయుక్తులు పన్నినా నియోజకవర్గాన్ని అభివృద్ధికి కేరాఫ్‌గా మార్చడమే లక్ష్యమన్నారు. బీటీపీ కాలువ పనులు పూర్తి చేసి, నియోజకవర్గంలోని చెరువులను నింపి, అన్నదాతలకు ఆనందం పంచుతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు డైరెక్టర్ వెంకటశివుడు యాదవ్, టీడీపీ పరిశీలకుడు నాగేశ్వర యాదవ్, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

● డీఆర్వో మలోల



అనంతపురం కలెక్టరేట్, జూలై 30(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తూ వారి పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీఆర్వో మలోల హెచ్చరించారు. కలెక్టరేట్‌లో బుధవారం తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టం-2007పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ... ఆర్డీఓ స్థాయిలో ట్రిబ్యునల్ ద్వారా వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కొన్ని కుటుంబాల్లో వృద్ధులు నిర్లక్ష్యానికి, నిరాదరణకు లోనవుతున్నారన్నారు. తమ పిల్లల నుంచి రక్షణ కల్పించాలనీ, వేధింపుల నుంచి కాపాడాలని వృద్ధుల నుంచి ఫిర్యాదులు అధికమయ్యాయన్నారు. ఆస్తులు రాయించుకునే వరకు బాగానే ఉండి, అనంతరం తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం సీనియర్ సిటిజన్ సంరక్షణ, రక్షణను తెలిపే చట్టాలపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో కూడా అధికారులు.. వృద్ధుల హక్కులకు భంగం కలిగించకుండా సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో అలాంటి వారి కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆర్డీఓ కేశవనాయుడు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి అర్చన, డీఆర్‌డీఏ పీడీ శైలజ, డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి పాల్గొన్నారు.

13న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

అనంతపురం న్యూటౌన్, జూలై30(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం ఆగస్టు 13న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ శివశంకర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆర్థిక, ప్రణాళిక, అభివృద్ధి పనులు, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య సేవలు, మహిళా శిశు సంక్షేమం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమ తదితర అంశాలపై చర్చించేలా ఎజెండా తయారు చేశారు.

రేపు పింఛన్ల సొమ్ము పంపిణీ

● డీఆర్‌డీఏ పీడీ శైలజ



అనంతపురం అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు నెలకు సంబంధించి ఒకటో తేదీన ఉదయం నుంచి ఇంటి వద్దనే లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శైలజ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు నెలకు సంబంధించి జిల్లాలోని 2,80,811 మంది లబ్ధిదారులకు రూ.124.99 కోట్ల పింఛన్ సొమ్మును ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఆగస్టు 1వతేదీ ఉదయం 7 గంటల నుంచి పింఛన్ల సొమ్మును లబ్ధిదారుల ఇంటి వద్దకే సిబ్బంది వెళ్లి అందజేస్తారన్నారు. శుక్ర, శనివారాల్లో పింఛన్ సొమ్ము అందజేస్తారన్నారు. తొలిరోజే లబ్ధిదారులందరికీ పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. తొలిరోజు పింఛన్ సొమ్ము తీసుకోనివారు మరుసటి రోజు సచివాలయం వద్దకెళ్లి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల్లోపు తీసుకోవాలని సూచించారు.

ఉచిత గ్యాస్ కొందరికేనా..?

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు	5,72,289
తొలి విడత సొమ్ము జమైనవారు	3,21,612
తొలి విడత పెండింగ్	2,50,677
రెండో విడత సొమ్ము జమైనవారు	3,33,737
రెండో విడత పెండింగ్	2,38,552

రావోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి వారు జిల్లావ్యాప్తంగా లక్షల్లో ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. రెండో విడత సబ్సిడీ జమ గడువు ఏప్రిల్‌లో మొదలై గురువారంతో ముగుస్తోంది. ఉచిత గ్యాస్ పథకాన్ని ఎల్‌పీజీ కనెక్షన్, తెల్లరేషన్, ఆధార్ కార్డులను ప్రామాణికంగా అమలు చేస్తున్నారు. రెండో విడత కింద 3,33,737 మంది ఖాతాల్లోకి రూ.2.72 కోట్ల రాయితీ నగదు జమైందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. ఇంకా 2,38,552 మందికి ఉచిత గ్యాస్ సిలిండర్ల సొమ్ము జమకావాల్సి ఉందని పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు దాదాపు 80శాతం గ్యాస్ సిలిండర్లు తీసుకున్నట్లు ఆ శాఖ అధికారులే చెబుతున్నారు.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ

రెండో విడత ఉచిత గ్యాస్ సొమ్ము జమ గడువు గురువారంతో ముగియనుంది. చాలామంది లబ్ధిదారుల ఖాతాల్లోకి జమకాకపోవడంతో డీఎస్‌ఓ, తహసీల్దార్లు, గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాలకు వారు ఫోన్లు చేస్తున్నట్లు సమాచారం. అధికారులు అదిగో.. ఇదిగో.. అని చెబుతూ తప్పించుకుంటున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం ఉచిత గ్యాస్ వర్తింపునకు వివిధ కారణాలను పరిగణనలోకి తీసుకుంటోంది. విద్యుత్ బిల్లులు ఎక్కువగా వచ్చాయనీ, ఇంట్లో ఉద్యోగులు ఉన్నారనీ, నాలుగు చక్రాల వాహనం ఉందనీ, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారనీ, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారనీ, బ్యాంకు ఖాతాకి ఆధార్ అనుసంధానం కాలేదనీ, లబ్ధిదారులకు రెండు, మూడు బ్యాంకుల్లో ఖాతాలున్నాయనీ, గ్యాస్ కనెక్షన్ బ్యాంకు ఖాతా నంబరుతో ఈకేవైసీ పూర్తి కాలేదనీ, గ్యాస్ కనెక్షన్ ఒకరి పేరున.. సిలిండర్ మరొకరు వినియోగిస్తున్నారంటూ ఇలా అనేక కారణాలతో లబ్ధిదారులకు అందాల్సిన ఉచిత గ్యాస్ సొమ్మును ఎగ్గొడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టోల్ ఫ్రీ నంబరు 1967 ఏర్పాటు

ఉచిత గ్యాస్ సిలిండర్ నగదు జమకాలేదని చాలామంది చెబుతున్నారు. వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసింది. ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ నంబరు చెబితే సబ్సిడీ సొమ్ము ఎందుకు జమ కాలేదో అధికారులు తెలియజేస్తారు. సబ్సిడీ సొమ్ము రానివారు 1967 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి, వివరాలు అందిస్తే కాల్‌సెంటర్ నుంచి వారి మొబైల్‌కు సమాచారం ఇస్తారు. వాటిని పరిశీలించి వినియోగదారుడు ఆ సమస్యను పరిష్కరించుకోవాల్సి ఉంటుంది.

సాంకేతిక కారణాలతో జమ కాలేదు



లబ్ధిదారులు ఈకేవైసీ గ్యాస్ కనెక్షన్లకు ఇచ్చిన ఫోన్, ఆధార్ నంబర్లు ఒకదానికొకటి సరిపోకపోవడంతో చాలామందికి ఉచిత గ్యాస్ సొమ్ము అందలేదు. వారు టోల్ ఫ్రీ నంబరు 1967కి కాల్ చేస్తే సొమ్ము ఎందుకు జమకాలేదో సమాచారం ఇస్తారు. సాంకేతిక సమస్య పరిష్కారమైతే ఉచిత గ్యాస్ సిలిండర్లు ఉన్న లబ్ధిదారులందరికీ సొమ్ము జమవుతుంది.

- వంశీకృష్ణారెడ్డి, డీఎస్‌ఓ

దిబ్బ కరుగుతోంది..!


మట్టి ఎరువు

(5వ పేజీ తరువాయి)

రూ.12.60 కోట్లకు కాంట్రాక్ట్ అప్పగించారు.

రూ.26కోట్లు మింగేసిన వైసీపీ పాలకులు

గత వైసీపీ ప్రభుత్వం డంపింగ్ యార్డు పేరుతో కోట్లాది రూపాయల నిధులు మింగేసింది. 2019 ఎన్నికలకు ముందు అప్పటి వైసీపీ అభ్యర్థులు డంపింగ్ యార్డు తరలిస్తామని ప్రగల్భాలు పలికినా అడుగు కూడా ముందుకు పడలేదు. చెత్తను తరలించే పేరుతో అప్పటి వైసీపీ పాలకులు రూ.26కోట్ల వరకు బిల్లులు చేసుకుని, మెక్కేశారు. చెత్త, మట్టిని అక్రమంగా తరలించిన వైసీపీ ప్రజాప్రతినిధులు కోట్లాది రూపాయల సొమ్మును జేబుల్లోకి వేసుకున్నారు. ఇదే విషయాన్ని వైసీపీకి చెందిన కార్పొరేటర్లు బహిరంగంగానే పలు కౌన్సిల్ సమావేశాల్లో లేవనెత్తడం గమనార్హం.

పారదర్శకంగా ప్రక్రియ



నగరవాసులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న డంపింగ్ యార్డుకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో బయోమైనింగ్ ప్రాసెస్ చేపడుతోంది. పబ్లిక్ హెల్త్‌తోపాటు మున్సిపల్ ఇంజనీర్లు సంయుక్తంగా ప్రాసెసింగ్‌ను పర్యవేక్షిస్తున్నారు. మొత్తం ప్రక్రియ సీసీ కెమెరాల నిఘానీడలో నడుస్తోంది. ప్రతి పని ఆన్‌లైన్‌లో రికార్డులు నమోదవుతాయి. అక్టోబరు 2వతేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు బయోమైనింగ్ పనులు పూర్తి చేయాలని జిగ్మా సంస్థకు సూచించాం.

-బాలస్వామి, కమిషనర్, నగరపాలక సంస్థ

1.68లక్షల టన్నుల చెత్త ఉంది



డంపింగ్ యార్డులో 1.68లక్షల మెట్రిక్ టన్నుల చెత్త ఉంది. దీనిని బయోమైనింగ్ ద్వారా మూడు భాగాలుగా వేరుచేసి ప్రభుత్వం సూచించిన విధంగా తరలిస్తాం. ప్లాస్టిక్‌ను సిమెంట్ ఫ్యాక్టరీలకు, రాళ్ల రప్పలను గుంతలు, రహదారుల నిర్మాణాలకు, మట్టి ఎరువును రైతుల పొలాలకు తరలించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చిన వెంటనే ఆ మేరకు చర్యలు తీసుకుంటాం. పాత చెత్త 1.68 లక్షల టన్నులు ప్రాసెస్ పూర్తిచేసిన తరువాత కొత్త వచ్చే దానిని బయోమైనింగ్ చేయడంపై స్పష్టత వస్తుంది.

-ఆదినారాయణ, పబ్లిక్‌హెల్త్ అనంతపురం డివిజన్ ఈఈ

చాలా అప్రమత్తంగా ఉండాలి



బయోమైనింగ్‌పై చాలా అప్రమత్తంగా ఉండాలి. చెత్త కళ్లలోకి పడకుండా కళ్లద్దాలు పెట్టుకుంటాం. దుర్వాసనను తట్టుకోవడానికి రెండు మాస్కులు ధరిస్తున్నాం. తలకు హెల్మెట్ వాడుతున్నాం. నిర్లక్ష్యం చేస్తే చెత్త, దుర్వాసనకు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

-సంతోష్‌కుమార్, జిగ్మా సంస్థ ఉద్యోగి

అనాథ పిల్లలను దత్తత తీసుకున్న మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

గోరంట్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనాథ పిల్లలను దత్తత తీసుకుంటున్నట్లు మంత్రి సవిత బుధవారం ప్రకటించారు. గోరంట్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బంగారుకుటుంబం పీ4 సర్వేలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఎంతోమంది సంపన్నులు, ఉద్యోగులకు ఇతరులకు సేవ చేయాలని ఉన్నా, ఎలా చేయాలో తెలియని స్థితిలో ఉన్నారన్నారు. అలాంటి వారి కోసమే రాష్ట్ర ప్రభుత్వం పీ-4 విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. అధిక సంఖ్యలో మార్గదర్శకులుగా చేరి గోరంట్లను జిల్లాలోనే నెంబర్ వన్ మండలంగా తీర్చిదిద్దాలన్నారు. ఆర్డీవో సువర్ణ పది కుటుంబాలు, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ నరేంద్రలు ఐదు కుటుంబాల వంతున దత్తత తీసుకున్నారు. టీడీపీ నాయకులు నిమ్మల శ్రీధర్ 10, నాగరాజు 11, సోముశేఖర్, నాగేనాయక్ 10వంతున, సుబ్బారెడ్డి 42, మహమ్మద్ 3, గిరిధర్ 10, షాకీర్ బాషా 5, పచ్చా అశోక్, నరేష్, బాలక్రిష్ణలు 5 కుటుంబాల వంతున దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, డీపీఓ సమత, పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ నరేంద్ర, సీఐ శేఖర్, ఎన్డీఏ నాయకులు, డీలర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పోలీసుల అదుపులో వడ్డీ వ్యాపారులు?

ధర్మవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు రమణ, భారతి దంపతులపై దాడిచేసిన వడ్డీ వ్యాపారులు నలుగురు పోలీసుస్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది. చేనేత కార్మికుడు రమణపై దాడి జరిగిన రోజే టూటౌన్ సీఐ రెడ్డప్ప ఏడుగురిపై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నిందితులు పరారీలో ఉన్న విషయం తెలిసిందే. నిందితులను గురువారం అరెస్టు చూపించనున్నట్లు తెలిసింది.

పాముకాటుకు బాలుడి బలి


హితన్ మృతదేహం

పెనుకొండటౌన్, జూలై30(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో ఎనిమిదేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన బుధవారం పెనుకొండలో జరిగింది. అర్బన్ కాలనీలో నివాసముంటున్న మహేష్, సుకన్య దంపతులకు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాము జొరబడి హితన్(8)ను కాటు వేసింది. నొప్పితో బాలుడు అల్లాడుతుండగా కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి మూలాన పాము ఉండటం గుర్తించారు. వెంటనే దానిని చంపి బాలుడిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108లో అనంతపురం తరలిస్తుండగా మృతి చెందినట్లు కుటుంబికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

క్వారీ కొండపై నుంచి పడి ఆపరేటర్ మృతి

గుత్తిరూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలచెరువు గ్రామ సమీపంలో కంకర క్వారీ కొండపై నుంచి పడి ఆపరేటర్ రఘురామ్(35) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ముదిగుబ్బ మండలం నాగలగుబ్బల గ్రామానికి చెందిన రఘురామ్ కంప్రెషర్ ఆపరేటర్‌గా పని చేస్తుండేవాడు. బుధవారం మధ్యాహ్నం క్వారీలో కొండపై ఘాతం పెడుతుండగా, కంప్రెషర్ మిషన్ కదుతుండటంతో దాన్ని అదుపు చేసేందుకు రఘురామ్ అక్కడికి వెళ్లాడు. అయితే అక్కడ ప్రమాదవశాత్తు కాలుజారి కొండపై నుంచి క్వారీలోని రాళ్లపై పడి, మృతి చెందాడు. ఎస్ఐ సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృత్యుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

మహిళ ఆత్మహత్య


దివ్యకుమారి (ఫైల్)

గుంతకల్లుటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన దివ్యకుమారి(35) బుధవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు... దివ్యకుమారి, చంద్రశేఖర్‌లు ప్రేమించి 2013లో వివాహం చేసుకున్నారు. చంద్రశేఖర్ గుత్తిరోడ్డులోని రైస్ షాపులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. దివ్యకుమారి ఆరు నెలల నుంచి కడుపునొప్పితో బాధపడుతుండేది. పలుచోట్ల వైద్యం చేయించిన నయం కాకపోవడంతో తీవ్రంగా మనస్తాపం చెందింది. ఉదయం భర్త షాపునకు, ఇద్దరు పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో దివ్యకుమారి ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుంది. మధ్యాహ్నం భర్త చంద్రశేఖర్ ఇంటికి వచ్చి చూడగా దివ్యకుమారి ఉరికి వేలాడుతూ కన్పించింది. ఆమెను కిందకు దింపి, పరీక్షించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పిచ్చికుక్క దాడి.. ఏడుగురికి గాయాలు


కుక్కకాటుకు గురైన చిన్నారి లాస్య

యల్లనూరు, జూలై30(ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ పిచ్చికుక్క రెండు రోజుల వ్యవధిలోనే ఏడుగురిని గాయపరిచింది. స్థానిక కేజీబీవీలో మంగళవారం ముగ్గురిని గాయపరిచిన కుక్క బుధవారం ఉదయం కృష్ణాపురం గ్రామంలో ఒక వృద్ధురాలు, మహిళను కరిచింది. వెన్నపూసపల్లిలో ఆడుకుంటున్న రెండు సంవత్సరాల చిన్నారి లాస్యను తీవ్రంగా గాయపరిచింది. అదే కాలనీలో మరో ఇద్దరిని కరిచింది. గాయపడ్డ వారిని 108వాహనంలో యల్లనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కృష్ణాపురంలో వృద్ధురాలు రాములమ్మ కుక్క కరిచే సమయంలో కిందపడటంతో కాలు కూడా విరిగినట్లు బాధితులు తెలిపారు.

శక్తిస్వరూపిణి

- అతివలకు అండగా శక్తి టీమ్స్
- యాప్‌లో ఫిర్యాదు చేస్తే చాలు తక్షణ సాయం
- అఘాయిత్యాలు, మోసాలపై అవగాహన
- నిర్మానుష్య ప్రదేశాల్లోనూ డ్రోన్లతో నిఘా


కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్ సభ్యులు

అనంతపురం క్రైం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులు, అఘాయిత్యాలు, వేధింపుల నిరోధానికి జిల్లా పోలీస్ యంత్రాంగతం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రత్యేకంగా శక్తి టీమ్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాలోని పార్కులు, రద్దీ ప్రదేశాలు, కాలేజీలు, షాపింగ్ మాల్స్, ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో నిఘా ఉంచుతారు. మహిళలు, అమ్మాయిలకు వేధింపుల నుంచి రక్షణ పొందడంపై శక్తి టీమ్స్ సభ్యులు అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడైనా ఒంటరి మహిళలను వేధిస్తుంటే డ్రోన్ నిఘా ద్వారా గమనించి ఆయా ప్రాంతాలకు వెంటనే చేరుకుని బాధితులకు శక్తి టీమ్స్ అండగా నిలుస్తాయి. జిలాలో ఏడు శక్తి బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా 7,00126 మంది తమ ఫోన్లో శక్తి యాప్‌ను వినియోగిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న బృందాలు

మహిళలకు అందుబాటులో ఉన్న భద్రత, రక్షణ అవకాశాలు, సదుపాయాలు, వనరులపై శక్తి టీమ్స్ అవగాహన కల్పిస్తున్నాయి. శక్తి టీమ్స్‌లో కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐ, ఎస్ఐలతో కలిపి ఐదు నుంచి ఏడుగురు సభ్యులు ఉంటారు. ఈ టీం సభ్యులు ఆయా సబ్ డివిజన్ పరిధిలో సంచరిస్తూ ఉంటారు. కళాశాలలు, పార్కులు, స్కూళ్లలోకి వెళ్లి పిల్లలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గుర్తించడం ఎలా..? ఆపదలో ఉన్నప్పుడు శక్తి యాప్‌ను ఎలా ఉపయోగించాలన్న అంశాలపై వివరిస్తారు. పోక్సో యాక్ట్, స్వీయ రక్షణ ఎలా, ఈవ్ టీజింగ్, ప్రేమ వేధింపుల నుంచి ఎలా బయటపడాలి...? తదితర అంశాలపై మహిళలు, యువతులు, బాలికలకు అవగాహన కల్పిస్తారు.

జిల్లాలో ఏడు శక్తి టీమ్స్

జిల్లా వ్యాప్తంగా 7 శక్తి బృందాలను ఏర్పాటు చేశారు. అనంతపురంలో రెండు బృందాలు ఉన్నాయి. అనంతపురం సబ్ డివిజన్ 1, అనంతపురం రూరల్ సబ్ డివిజన్ 1, తాడిపత్రి సబ్ డివిజన్-1, గుంతకల్లు సబ్ డివిజన్ -1, కళ్యాణదుర్గం సబ్ డివిజన్ -1 చొప్పున ఏడు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడు ప్రాంతాల పరిధిలో శక్తి టీమ్స్ సభ్యులు విధులు నిర్వర్తిస్తారు. ఆపద సమయాల్లో శక్తి యాప్‌కు వచ్చే ఎస్ఓఎస్ కాల్స్, డయల్ 100, 112, 181, 1098, 1930కు వచ్చే కాల్స్‌కు వీరు వేగంతా స్పందిస్తారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యలను పరిష్కరిస్తారు.

మహిళల చేతిలో రక్షణ 'శక్తి'



శక్తి యాప్ లోగో

శక్తి యాప్‌లో శరవేగంగా స్పందించే ఎస్ఓఎస్ బటన్ ఉంటుంది. దాన్ని టచ్ చేయగానే బాధితుల సమాచారం పోలీసులకు వెళ్తుంది. అందులో డయల్ 100, 112 ఆప్షనతో పాటు, గ్రీవెన్స్ కంప్లైంట్, రిపోర్ట్ మిస్సింగ్ చిల్డ్రన్, నైట్ షెల్టర్, ఫ్యామిలీ కౌన్సెలింగ్ రిక్వెస్ట్, 799348511 వాట్సప్ నంబర్ తోపాటు, సేఫ్ ట్రావెల్, శక్తి హెల్ప్‌లైన్ ఆప్షన్ బటన్లు ఉంటాయి. వీటిని టచ్ చేయడం ద్వారా సులభంగా, వేగంగా బాధిత మహిళలు, యువతులు, బాలికలు పోలీస్ శాఖ నుంచి సాయం పొందవచ్చు.

అప్రమత్తం చేస్తున్నాం



వేధింపులు, ఇతర అఘాయిత్యాలపై మహిళలు, యువతులను అప్రమత్తం చేస్తున్నాం. శక్తి టీమ్స్ నిత్యం రద్దీ ప్రదేశాలు, కళాశాలలు, స్కూళ్లలో శక్తి యాప్, ఇతర రక్షణ చట్టాలపై చైతన్యం కలిగిస్తున్నాయి. ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేకంగా డ్రోన్లు కూడా వినియోగిస్తున్నాం. జిల్లాలో ఏడు లక్షల మందికిపై గా శక్తి యాప్ వినియోగిస్తున్నారు.

-మహబూబ్ బాషా, దిశ డీఎస్పీ

ఎరువులు వచ్చాయోచ్..!

అనంతపురం అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 2152 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు ఏడీఏ అల్తాఫ్ అల్లాఖాన్ పేర్కొన్నారు. ఇందులో 10-26-26 రకం ఎరువులు 1316 మెట్రిక్ టన్నులు, అమ్మోనియం సల్ఫేట్ ఎరువులు 836 మెట్రిక్ టన్నులు వచ్చాయన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఏపీ మార్క్‌ఫెడ్, హోల్‌సెల్, రిటైల్ డీలర్లకు ఎరువులు కేటాయిస్తామని తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు నవోదయ విద్యార్థిని


అర్చన

తనకల్లు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటిక్రాస్‌కు చెందిన అర్చన షాట్‌పుట్ అండర్- 19లో జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఆమె తండ్రి శివ బుధవారం తెలిపారు. తన కుమార్తె అన్నమయ్య జిల్లా వలసపల్లి వద్ద ఉన్న నవోదయ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. కళాశాల తరపున నెల్లూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తన కుమార్తె ప్రతిభ చూపిందన్నారు. అలాగే కర్ణాటకలోని గదగ్‌లో నిర్వహించిన పోటీల్లో విశేషంగా రాణించి జాతీయ జట్టుకు ఎంపికైందన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఝూన్సీలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొననున్నట్లు తెలిపారు.

నిండిన జీడిపల్లి

- ఆరు రోజుల్లోనే మరువ పారిన రిజర్వాయరు
- వెడల్పు పనులతోనే త్వరగా...


జలహారతి ఇస్తున్న తహసీల్దార్ అనిల్ కుమార్, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు

గుంతకల్లు/బెళుగుప్ప, జూలై 30(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా వైడెనింగ్ సామర్థ్యం ఏమిటో ఆరు రోజుల్లోనే తెలిసివచ్చింది. సాధారణంగా పన్నెండు, పదమూడు రోజుల్లో నిండాల్సిన జీడిపల్లి రిజర్వాయరు, కాలువ వైడెనింగ్ కారణంగా ఆరు రోజుల్లోనే నిండి మరువ పారుతోంది. హంద్రీనీవా తొలిదశ కెనాల్‌లో అంతిమ ప్రదేశమైన జీడిపల్లి రిజర్వాయరు 1.60 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగి ఉంది. ప్రతి ఏటా దాదాపు 0.80 టీఎంసీల నీటిని నిల్వ ఉంచుతారు. ఈనెల 24న జీడిపల్లికి కృష్ణా నీరు చేరింది. 30న మధ్యాహ్నం 3 గంటలకు రిజర్వాయరు నిండి మరువ పారింది.

సగం రోజుల్లోనే..

వైడెనింగ్ జరగనప్పుడు జీడిపల్లి రిజర్వాయరు 0.80 టీఎంసీల నీటి నిల్వ నుంచి 1.6 టీఎంసీలు చేరడానికి దాదాపు 12 నుంచి 13 రోజులు పట్టేది. గత ఏడాది గరిష్ఠంగా 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో జీడిపల్లి రిజర్వాయరుకు నీరు చేరింది. వైడెనింగ్ పూర్తయిన కారణంగా ప్రస్తుతం రెండువేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రిజర్వాయర్‌కు లభించింది. దీంతో ఆరు రోజుల్లోనే రిజర్వాయరు నిండి మరువ పారుతోంది. దీంతో తహసీల్దార్ అనిల్‌కుమార్, వీఆర్వో యర్రిస్వామి, హంద్రీనీవా అధికారులు ఈఈ నాగరాజు, ఎస్ఈ రాజస్వరూప్, ఏఈఈ పృథ్వీసాగర్, పీఏబీఆర్‌కు నీటిని విడుదల చేసి, మరువ వద్ద గంగపూజ చేసి హారతి నిచ్చారు.

కూటమి ప్రభుత్వంలోనే పంచాయతీల అభివృద్ధి



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

అనంతపురం క్రైం, జూలై 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే పంచాయతీల అభివృద్ధి జరిగిందని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. అనంతపురం వచ్చిన ఆయన ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.6 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశారన్నారు. వైసీపీ హయాంలో పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. మాజీ సీఎం జగన్ పంచాయతీను నిర్వీర్యం చేశారంటూ మండిపడ్డారు. 2024-25 ఏడాదికి సంబంధించి 2వ విడత 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ. 1120 కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏపీ పీఆర్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూషణ్, ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు రంగయ్య, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర నాయకులు ఇస్మాయిల్, మీనాక్షినాయుడు పాల్గొన్నారు.

75 శాతం రాయితీతో గడ్డి జొన్నలు

అనంతపురం అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు 75 శాతం రాయితీతో గడ్డి జొన్నలు పంపిణీ చేస్తామని పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. కేజీ గడ్డి జొన్నలు పూర్తి ధర రూ.92లు, ఇందులో రూ.69లు (75 శాతం) రాయితీపోను రైతు వాటా కింద రూ.23లు చెల్లించాలన్నారు. జిల్లాకు ఈసారి 77 మెట్రిక్ టన్నులు గడ్డి జొన్నలు సరఫరా చేశారన్నారు. గడ్డి జొన్నలు కావాల్సిన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రంలో డబ్బులు చెల్లించి, తీసుకోవాలని సూచించారు.

ఈ- పంట నమోదు పక్కాగా చేయాలి

అనంతపురం అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యాన తోటల ఈ పంట నమోదు ప్రక్రియను పక్కాగా చేయాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి ఆదేశించారు. బుధవారం ఉద్యాన శాఖ జిల్లా కార్యాలయం నుంచి ఉద్యాన శాఖ ఏడీ దేవానంద్, టెక్నికల్ హెచ్ఓ రత్నకుమార్‌లతో కలిసి ఉద్యాన అధికారులతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతుల వారిగా ఏఏ రకాల ఉద్యాన పంటలు సాగు చేశారన్న వివరాలతోపాటు తోటలో రైతును నిల్చొబెట్టి ఫోన్ తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. నిర్దేశించిన సమయంలోగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణ

అనంతపురంరూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా లౌకికవాదులు, ప్రజాతంత్రవాదులు, కులసంఘాల నాయకులు, వామపక్ష భావజాలంకలిగిన ప్రతిఒక్కరూ మతోన్మాదశక్తుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ ఆధ్వర్యంలో మండలంలోని సోములదొడ్డి గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అందరం సమైక్యంగా ఉన్నామంటే దానికి ప్రధాన కారణం అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు కమ్యూనిస్టులు, అంబేడ్కర్ వాదులు, ప్రజాతంత్రవాదులు కసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లికార్జున, రామకృష్ణ, నారాయణస్వామి, రమేష్, నరేష్, రాజేష్ గౌడ్, కుళ్లాయిస్వామి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

అంధటీచర్లకూ ముఖ హాజరు తప్పనిసరి

- విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు



విద్యాశాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల కాపీ

అనంతపురం విద్య, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న అంధటీచర్లు కూడా ఇక మీదట ముఖ హాజరు వేయాలల్సిందేనంటూ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న 1331మంది అంధ టీచర్లు ముఖహాజరు వేసేవారు కాదు. ఇందులో జడ్పీ, మండల పరిషత్‌లోనే 1079మంది టీచర్లు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మిగిలిన వారందరూ మున్సిపల్, గవర్నమెంట్, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూల్ టీచర్లు ఉన్నారు. దీంతో వందశాతం టీచర్ల ముఖహాజరు నమోదు కావడం లేదు. అందుకే రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ అంధటీచర్లకు మినహాయింపు రద్దు చేశారు. వారు తప్పకుండా ముఖహాజరు వేయాలని వెబెక్స్‌లో కూడా ఆర్జేడీ, డీఈఓలకు ఆదేశాలు చేశారు. దీంతో తక్కువ అంధత్వం ఉండి, పాత నిబంధనలను అడ్డుపెట్టుకొని ముఖహాజరుకు దూరంగా ఉంటూ వస్తున్న కొందరు ఉలిక్కి పడుతున్నారు. ఇంతకాలం ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఎంఈఓలను వివిధ రకాలుగా మచ్చిక చేసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరించిన తీరుకు బ్రేక్ పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సెలవులో వెళ్లినా ముఖ హాజరు లేదు కాబట్టి ఉన్న ఒప్పందాల మేరకు హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేసే వారనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్కువగా అనంతపురం, అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాల్లో ఇలాంటి వ్యవహారాలు అధికంగా జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం కమిషనర్ ఉత్తర్వులతో వారంతా తప్పనిసరిగా పాఠశాలకు సమయానికి వెళ్లాల్సి వస్తోంది. హెచ్ఎంలేదా తోటి టీచర్ల సహకారంతో ముఖహాజరు వేయాల్సి వస్తోంది.

రోడ్లు విస్తరించాలని కేంద్రమంత్రికి వినతి


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చర్చిస్తున్న రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి, ఎన్టీఆర్ జిల్లాల్లోని రోడ్లను విస్తరించాలని కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కోరినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. న్యూఢిల్లీలో కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీని కలిసి వివిధ అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో రూ.9500కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాన, ప్రారంభోత్సవం కోసం ఆగస్టు 2న రాష్ట్రానికి నితిన్‌గడ్కరీ వస్తున్నట్లు వెల్లడించారు.

గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటు అభినందనీయం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి


వివరాలు అడిగి తెలుసుకుంటున్న మాధవ్, పార్థసారథి

పామిడి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గజరాంపల్లి గ్రామంలో వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్ పరిశ్రమను ఏర్పాటు చేయడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. టీడీపీ నాయకుడు, పీజేఆర్ ట్రస్టు ఛైర్మన్ పెరుమాళ్ల జీవానందరెడ్డి గజరాంపల్లిలో ఏర్పాటు చేసిన వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్ పరిశ్రమను బుధవారం వారు సందర్శించారు. గార్మెంట్స్‌లో దుస్తుల తయారీ విధానాన్ని పరిశీలించారు. గ్రామీణ ప్రాంతంలో పరిశ్రమను నెలకొల్పి ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చి మహిళల్లో ఆత్మస్థైర్యం నింపడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


సంతోష్‌నాయక్ (ఫైల్)

గోరంట్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టిపల్లి తండాకు చెందిన సంతోష్‌నాయక్ (25) అనుమానాస్పద స్థితిలో బుధవారం మృతి చెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. గంగంపల్లి తండాకు చెందిన శంకర్‌నాయక్ కుమారుడు సంతోష్‌నాయక్‌కు ఐదేళ్ల కిందట గుట్టిపల్లితండాకు చెందిన విజయలక్ష్మీబాయితో వివాహం జరిగింది. భార్యతో అత్తగారి ఊరిలోనే నివాసముంటున్నారు. వారికి ఐదునెలల కుమారుడున్నాడు. సంతోష్‌నాయక్ బుధవారం ఉదయం భార్య కొడుతోందని, తండ్రికి ఫోన్ చేసి తెలిపాడన్నారు. తరువాత సంతోష్‌నాయక్ మృతి చెందడం పలు అనుమానాలకు దారి తీస్తోందన్నారు. కేసు నమోదు చేసి, శవాన్ని పెనుకొండకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు అందుకుంటున్న ఆంజనేయస్వామి

రాప్తాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరూరు గ్రామం లో గల బీసీ కాలనీలో ఆంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠను బుధవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా హోమాలు జరిపి.. వేదమంత్రోచ్చారణల నడుమ ఆంజనేయస్వామి విగ్రహాన్ని, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మరూరు సహకార సొసైటీ చైర్మన్ గోపా ల్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి, మాజీ డీలర్ సూరి తదితరులు పాల్గొన్నారు.

పథకాల సొమ్మును అప్పులకు జమ చేయకండి



బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గార్లదిన్నె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాల సొమ్మును బ్యాం కులు వారి అప్పులకు జమ చేయకూడదని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని కల్లూరు స్టేట్ బ్యాంకు మేనేజర్ అంజిబాబును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్ప యాదవ్ మాట్లాడుతూ... ఐదారేళ్లుగా వర్షాలు సకాలంలో కురవక రైతులు, కౌలు రైతులు పంటలు తీవ్రంగా నష్టపోయారన్నారు. పంటల సాగు కోసం బ్యాంకుల్లోనూ, బయట వ్యక్తుల నుంచి అప్పులు తెచ్చుకున్నారన్నారు. అయితే పంటలు చేతికి రాకపోవడంతో అప్పులు తీర్చలేని స్థితిలో ఉన్నారన్నారు. కాగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న తల్లి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ములతో పాటు, ఉపాధి కూలి బిల్లులను బ్యాంకుల వాళ్లు అప్పులకు జమ చేసుకోవడం సరి కాదన్నారు. పథకాల సొమ్మును అప్పులకు జమ చేయకుండా లబ్ధిదారులకు అందేలా చూడాలని కోరారు. అలాగే బంగారు రుణాలను వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎండీ రాముడు, సహాయక కార్యదర్శి రామకృష్ణ, రైతు సంఘం నాయకులు నల్లప్ప, శంకర్, నారాయణస్వామి, ముత్యాలు, ఆదెన్న, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

సీఎంను విమర్శించే స్థాయి లేదు: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శింగనమల, జూలై 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును విమర్శించే స్థాయి శైలజానాథ్‌కు లేదని టీడీపీ మండల నాయకులు పేర్కొన్నారు. మండలంలో గుమ్మేపల్లిలో బుధవారం పార్టీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, సీనియర్ నాయకుడు మారుతీనాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు గుర్రం లక్ష్మీనారాయణ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటనపై మాజీమంత్రి, వైసీపీ నేత శైలజానాథ్ చేసిన విమర్శలను ఖండించారు. సీఎం రాష్ట్ర అభివృద్ధి కోసం, పరిశ్రమల స్థాపన కోసం సింగపూర్ వెళితే.. బాబు సింగపూర్‌కు ఉరేగారు అని అనడం సరికాదన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రానికి ఒక పరిశ్రమ అయినా వచ్చిందా అని ప్రశ్నించారు. చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఇలాంటి విమర్శలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌లో ఉన్నంత కాలం జగన్ అవినీతి పరుడని విమర్శించిన శైలజానాథ్‌కు వైసీపీ కండువా వేసుకోగానే జగన్ నీతిపరుడయ్యాడా అని దుయ్యబట్టారు. ఇప్పటికైనా శైలజానాథ్ తన స్థాయి ఎంటో తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. లేకపోతే తగిన మూల్య చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. నాయకులు మాసూల చంద్రమోహన్, పెద్దన్న పెద్దిరెడ్డి ఖాదర్‌బాషా, గురుగుంట్ల నారాయణస్వామి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

చెన్నేకొత్తపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనక్రాస్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలీస్ కానిస్టేబుల్ గాయపడ్డాడు. పెనుకొండ పట్టణానికి చెందిన మనోహర్ కొత్తచెరువు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే వ్యక్తిగత పని నిమిత్తం అనంతపురానికి వెళ్లి తిరిగి కారులో పెనుకొండకు బయలుదేరాడు. కోన క్రాస్ వద్దకు రాగానే కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలవగా స్థానికులు సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆశతో మోసపోవద్దు: ఐసీడీఎస్ పీడీ

అనంతపురం వైద్యం, జూలై 30(ఆంధ్రజ్యోతి): అవకాశాల పేరుతో ఆశ చూపి మానవ అక్రమ రవాణా చేసేవారి చేతిలో మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ పీడీ నాగమణి సూచించారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి తెలుగు తల్లి విగ్రహం వరకు కోఆర్డినేటర్ బీఎస్ శ్రీదేవి నేతృత్వంలో ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞచేయించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా పీడీ నాగమణి హాజరై మాట్లాడారు. ఉద్యోగం, పెళ్లి, చదువు తదితర అవకాశాల రూపంలో తీసుకెళ్లి బానిస వృత్తిలోకి చేరుస్తారన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, పరిస్థితులు ఎదురైనప్పుడు ఆ విషయాలను సంబంధిత అధికారులకు తెలియజేసి రక్షణ పొందాలని తెలిపారు. అనుమానాస్పద పరిస్థితులు, వ్యక్తులు తారసపడితే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ ఎమర్జెన్సీ 112/100 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ జగదీష్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, చైల్డ్‌హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ కృష్ణమాచారి, ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీదేవి

జగనన్న కాలనీలో మట్టి దొంగలు

- రోడ్లకు వేసిన మట్టి అక్రమ తరలింపు
- పట్టించుకోని అధికారులు

అనంతపురంరూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామారుపల్లి జగనన్న కాలనీలో మట్టిదొంగలు పడ్డారు. గుట్టు చప్పుడు కాకుండా లేఅవుట్‌లో రోడ్లకు తోలిన మట్టిని పెకలించి తరలిస్తున్నారు. గత కొన్నిరోజులుగా ఈ అక్రమరవాణా సాగుతున్నా.. సం బంధిత అధికారులు అటు వైపు తొంగిచూడకపోవడం గమనార్హం. కామారుపల్లి సమీపం లో గత ప్రభుత్వంలో జగనన్న కాలనీ ఏర్పా టు చేశారు. ఈక్రమంలో అక్కడ ప్లాట్లు విభజించి మట్టి రోడ్లు కూడా వేశారు. అయితే ఇళ్ల నిర్మాణాలకు భూమి అనువైంది కాకపోవడంతో లబ్ధిదారులు నిర్మాణాలకు ఆసక్తి చూపలేదు. దీంతో కాలనీ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న రీతిలో ఉండిపోయింది. అయితే ఇటీవల ఉపాధిహామీ కింద కామారుపల్లి - యాలేరు మట్టిరోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డుకు మట్టిని తోలే పనులను ఆత్మకూరు గ్రా మానికి చెందిన వైసీపీ నాయకులు చేపట్టారు. ఈక్రమంలో వారు కామరుపల్లి జగన్నకాలనీలో రోడ్లకు వేసిన మట్టిని జేసీబీతో పెకలించి రో డ్డు పనులకు తరలిస్తున్నారు. గత కొన్నిరోజులు మట్టి అక్రమ రవాణా సాగుతున్నట్లు తెలుస్తోంది. అయినా సంబంధిత అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దీంతో వైసీపీ నాయకులు మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు.



మట్టి లోడుతో వెళుతున్న ట్రాక్టర్

కీర్తన ఫైనాన్స్ కార్యాలయం ముట్టడి

- అడ్డుకున్న పోలీసులు
- ఆందోళనకారుల అరెస్టు



కార్యాలయాన్ని ముట్టడిస్తున్న ఏఐవైఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు

అనంతపురం విద్య, జూలై 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని తిలక్‌నగర్‌లో గల కీర్తన ఫైనాన్స్ కార్యాలయాన్ని ఏఐవైఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు బుధవారం ముట్టడించారు. కార్యాలయం వద్ద బైఠాయించి కీర్తన ఫైనాన్స్ చేసిన గోల్డ్ మోసాలపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘాల నాయకులు సంతో ష్‌కుమార్, పద్మావతి మాట్లాడుతూ.. కీర్తన ఫైనాన్స్ ఆర్బీఐ మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ ఎలాంటిభద్రతా ప్రమాణాలు లేకుండా కొనసాగుతోందన్నారు. ఇందులో రెండు కేజీలకుపైగా బంగారం అక్రమంగా దాచి ఉంచిన బండారం బయట పడిందన్నారు. ఇంత జరిగినా పోలీస్‌శాఖ సమగ్ర విచారణ జరపడం లేదన్నారు. కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని ఆందోళనకారులను అరెస్టు చేశారు. బాధితులకు న్యాయం చేయాలని ఆందోలన చేస్తే అరెస్టులు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈగోల్డ్‌స్కామ్‌పై పూర్తిస్థాయి విచారణను చేపట్టి సూత్రదారులు, మోసగాళ్లపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేసారు. నాయకులు పార్వతి, ఆనంద్, శ్రీనివాస్, శర్మాన్,జానకి, యశోదమ్మ, కమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ మహాసభ

అనంతపుం రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరు గ్రామంలో గురువారం సీపీఐ రాప్తాడు నియోజకవర్గ మహాసభను నిర్వహించనున్నట్లు నియోజకవర్గ కార్యదర్శి రామక్రిష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. తొలుత ఉదయం 10:30గంటలకు జన సేవాదళ్ ర్యాలీ ఉంటుందన్నారు. ఆతరువాత సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు మల్లికార్జున, నారాయణస్వామి, ప్రజాసంఘాల నాయకులు హాజరవుతారన్నారు. పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం

- 2న కలెక్టరేట్ వద్ద ధర్నా
- ఫ్యాప్టో చైర్మన్ శ్రీనివాసనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఫ్యాప్టో చైర్మన్ శ్రీనివాసనాయక్

అనంతపురం విద్య, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం చేపట్టనున్నట్లు ఫ్యాప్టో చైర్మన్ శ్రీనివాసనాయక్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఉపాధ్యాయభవన్‌లో బుధవారం ఫ్యాప్టో సమావేశం జరిగింది, ఈ సందర్బంగా తొలుత విద్య, ఉపాధ్యాయ రంగ సమస్యలు, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై చర్చించారు. అనంతరం ఫ్యాప్టోచైర్మన్ మాట్లాడుతూ ప్ర భుత్వం విద్య, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. బదిలీ అయిన టీచర్లకు రెండు నెలలుగా జీతా లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. పీఆర్సీ, ఐఆర్, డీఏలు, సరెండర్ లీవ్‌లు, సీపీఎస్ అరియర్స్ వంటి వాటి విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు ఆవేదన కలిగిస్తోందన్నారు. వీటిపై అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. దీనికి తోడు వివిధ రకాల కార్యక్రమాలు పెడుతూ టీచర్లను మరింత మానసికంగా వేదనకు గురి చేస్తోందని వాపోయారు. అందుకే రాష్ట్రకమిటీ ప్రభుత్వంపై ఉద్యమాలకు సిద్ధమైందన్నారు. అందులో భాగంగానే ఆగస్టు 2వ తేదీన కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధార్నా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పురుషోత్తంరెడ్డి, రమణారెడ్డి,లింగమూర్తి, గోవిందరాజులు, వెంకటరత్నం, వెంకటేశ్, సిరాజుద్దీన్, వెంకటసుబ్బయ్య, మల్లికార్జున, సూర్యుడు పాల్గొన్నారు.

రేపు చక్కెర వేలం

నార్పల, జూలై 30(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి ఆలయంలో చెక్కరపోగు చేసుకునేందుకు శుక్రవారం ఉదయం 8గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శోభ బుధవారం ప్రకటనలో తెలిపారు. 4వేల కేజీల చక్కెరకు వేలం పాడేందుకు రూ.20వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని అన్నారు.

నేడు మీ సమస్య-మా బాధ్యత

రామగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం గ్రామంలో గురువారం మీ సమస్య-మా బాధ్యత అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా సివిల్ రైట్స్‌డేను కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలంలోని అధికారులందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై30(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మోటార్లకు విద్యుత్తును సరఫరా చేసే కేబుల్ కాలిపోవడంతో గురువారం నగరంలో నీటిసరఫరాకు అంతరాయం ఏర్పడనుందని అనంత నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్, ఎస్ఈ రాజశేఖర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

వార్షికోత్సవ సభను విజయవంతం చేయండి

అనంతపురం టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సభను నిర్వహించనున్నామని, విజయవంతం చేయాలని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు టీవీ రెడ్డి బుధవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. సంస్థ ఆధ్వర్యంలో గత ఐదేళ్లుగా అనేక సాహిత్య, సామాజిక సేవాకార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ క్రమంలో సంస్థ ఐదో వార్షికోత్సవం పూర్తిచేసుకోనున్న నేపథ్యంలో సంస్థ కోసం సహకరించిన పలు వర్గాల వారిని సత్కరించనున్నట్లు చెప్పారు. తాను రచించిన 'అమరమ్' పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కవులు, రచయితలు, మేధావులు, సామాజిక సేవకులు విరివిగా సభకు హాజరు కావాలని ఆయన కోరారు.

● శునక ప్రవేశం



ఎస్కేయూ ఇంజనీరింగ్ కాలేజీలో వీధి కుక్కలు విడిది ఏర్పాటు చేసుకున్నాయి. ప్రిన్సిపాల్ చాంబర్ ఎదుట ఉన్న డ్రాయింగ్ హాల్లో ఓ కుక్క ఎలా దర్జాగా ప్రవేశించిందో చూడండి. వర్సిటీలోని అన్ని విభాగాల్లోనూ జంతు సంచారం పెరిగిపోయిందని విద్యార్థులు అంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం రూరల్

ఆర్టీసీ ఆర్ఎంకు ఘన సన్మానం



సుమంత్ ఆర్ ఆదోనిని సన్మానిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

అనంతపురం టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోనికి ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు సన్మానం చేశారు. ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని గురువా రం ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈనేపథ్యంలో బుధవారం సాయంత్రం ఎన్ఎంయూఏ నాయకులు ఆయన్ను ఛాంబర్‌లో కలిసి జ్ఞాపిక అందజేసి పూల మాలలు, శాలువాలతో సన్మానించి వీడుకోలు పలికారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జిల్లా చైర్మన్ సూరిబాబు, కార్యదర్శి ప్రతాప్ నారాయణ, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీరామ్ నాయక్, షబ్బీర్, రాష్ట్ర నాయకులు భాస్కర్‌నాయుడు, నాగరాజు, జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి, రీజియన్‌లోని వివిధ డిపోలు, గ్యారేజీల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్లు సీజ్

శింగనమల, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిమెలలో గల పెన్నానదిలో గత మంగళవారం రాత్రి అనుమతి లేకుండా ఇసుకను టిప్పర్లతో తరలిస్తుండడంతో గ్రామస్థులు ఆర్డీఓ కేశవనాయుడికి సమాచారం అందించారు. స్పందించిన ఆయన వెంటనే శింగనమల తహసీల్దార్ శేషారెడ్డిని అక్కడికి పంపించారు. తహసీల్దార్ దాడులు చేసి ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసి గార్లదిన్నె పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే ఎంతటివారిపైనా అయినా కఠినచర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

పంటల బీమాకు దరఖాస్తు చేసుకోండి: ఏఓ

రాప్తాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా కోసం రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని ఏఓ కృష్ణ చైతన్య సూచించారు. మండలంలోని అయ్యవారిపల్లిలో బుధవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులకు వేరుశనగ, కంది తదితర పంటల సాగులో మెలకువలపై సూచనలు ఇచ్చారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకానికి ఈ కేవైసీ పెండింగ్‌లో ఉన్న వారు వెంటనే చేయించుకోవాలని తెలిపారు. పంటల బీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కౌలు రైతులు కౌలు కార్డులు చేయించుకోవాలని చెప్పారు. ఏఈఓలు రంజిత, సుజిత, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మురుగు కాలువ

రాప్తాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లి గ్రామంలో శ్మశాన వాటిక సమీపంలోగల అంగన్వాడీ కేంద్రం వద్ద మురుగు కాలువ ప్రమాదకరంగా ఉంది. గ్రామంలోని మురుగు నీరంతా ఆ కాలువలోనే పారుతోంది. అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ కూడా లేదు. ఆ కేంద్రం ముందు కాలువపై కేవలం మూడు బండలు మాత్రమే ఉన్నాయి. చిన్నారులు కేంద్రంలోకి రాకపోకలు సాగించినప్పుడు ప్రమాదవశాత్తూ ఆ మురుగు కాలువలోకి పడే అవకాశం ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మించాలని, అలాగే మురుగు కాలవపైన పూర్తి స్థాయిలో బండలు వేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అంగన్వాడీ కేంద్రం ముందు ఉన్న మురుగుకాలువ

సీమలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై30(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో మరిన్ని సాగునీటి ప్రాజెక్ట్‌లు నిర్మించాలని రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జున రెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలో బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంతంలో తుంగభద్ర, కృష్ణా నదులపై మరిన్ని ప్రాజెక్ట్‌లు నిర్మించి సముద్రంలోకి వృథా పోతున్న నీటిని రాయలసీమకు మళ్లించి భూములను సస్యశ్యామలం చేయాలని తెలిపారు.

చట్టసభల్లో బీసీలకు 44శాతం రిజర్వేషన్లు కల్పించాలి..

జనాభా ప్రాతిపదికన బీసీలకు చట్టసభల్లో 44శాతం రిజర్వేషన్లు కల్పించాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగరాజు కోరారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసి వినతిపత్రం అందజేశారు. జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో బీసీలకు 44శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని విన్నవించారు.

ఢిల్లీ సీఎంను కలిసిన ఆర్యవైశ్యులు



ఢిల్లీ సీఎంకు వేంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీకి తొలి ఆర్యవైశ్య మహిళా ముఖ్యమంత్రిగా ఎన్నికైన రేఖా గుప్తాను ఏపీ ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు దూపకుంట్ల శబరి వరప్రసాద్, అత్తులూరి కృష్ణ కిరణ్, బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీ కలిశారు. ఢిల్లీలోని ఆమె చాంబర్‌లో బుధవారం వారు కలిసి వాసవీమాత, వెంకటేశ్వరస్వామి ప్రతిమలు బహూకరించి సత్కరించారు. ఈ సందర్భంగా దూపకుంట్ల శబరి వరప్రసాద్ మాట్లాడుతూ... దేశ రాజధాని ఢిల్లీకి ముఖ్యమంత్రిగా తమ సామాజిక వర్గానికి చెందిన మహిళ కావడం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం 26 జిల్లాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మహాశక్తి సమాఖ్య వార్షిక సభ



మాట్లాడుతున్న మేరీ వటమట్టం

చెన్నేకొత్తపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయ ఆవరణలో బుధవారం మహాశక్తి సమాఖ్య 13వ వార్షిక మహాసభను ఘనంగా నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మమ్మ, సీఈఓ రమీజాబి ఆధ్వర్యంలో ఈ సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాశక్తి సమాఖ్యను నాలుగు కో ఆపరేటివ్‌ల కలయికతో 9మండలాల్లో 34,146 మంది సభ్యులతో నిర్వహిస్తున్నటు తెలిపారు. ప్రస్తుతం రూ.65కోట్ల నికర విలువతో ఈ సమాఖ్య పని చేస్తోందన్నారు. 2024-25కు సంబంధించి కార్యక్రమాల నివేదికను సభలో వెల్లడించారు. ముఖ్యఅతిథిగా హాజరైన టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మేరీ వటవట్టం, బబ్లూగంగూలీ మాట్లాడుతూ... మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టింబక్టు కలెక్టివ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుకన్య, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన



కృష్ణతత్వంపై చిన్నారులకు బోధిస్తున్న దామోదర గౌరంగదాస్

అనంతపురం టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఇస్కాన్ మందిరంలో బుధవారం నిర్వహించిన చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన లభించింది. తొలుత ఆలయ ఆవరణలో ఇస్కాన్ మందిర చైర్మన్ దామోదర్ గౌరంగదాస్ కృష్ణతత్వం గురించి చిన్నారులకు బోధించారు. అనంతరం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇందులో నగరంతో పాటు సమీప గ్రామాల నుంచి విద్యార్థులు దాదాపు 1500 మంది దాకా హాజరయ్యారు. తర్వాత చిన్నారుల చేత హరేరామ హరేకృష్ణ నామస్మరణతో భజనలు చేయించారు. చిత్రలేఖనాల్లో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు ఆగస్టు 16వ తేదీ శ్రీకృష్ణాష్టమి రోజున ఇక్కడే జ్ఞాపికలు బహూకరించి సత్కరించనున్నట్లు దామోదర్ గౌరంగదాస్ తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

గార్లదిన్నె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు ఆగ్రహారానికి చెందిన ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ గ్రామంలో భూమి విషయంలో సుశాంత్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన రమణ, తిరుపతయ్య, గణేష్, నారాయణస్వామి, సూరి, శీన అనే ఆరుగురు వ్యక్తులు గత మూడు రోజుల క్రితం దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి ఆ ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నసనకోటలో గుండె వైద్యశిబిరం

రామగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట సచివాలయంలో బుధవారం అనంతపురానికి చెందిన మార్క్ ఆస్పత్రి వారు ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో సుమారు 139 మందికి వైద్యం లు వైద్య పరీక్షలు చేసి సమస్య ఉన్నవారిని చికిత్స నిమిత్తం తమ ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత సూచనల మేరకు ఈ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామని టీడీపీ సీనియర్ నాయకుడు రామ్మూర్తినాయుడు, సామాజిక సేవా కార్యకర్త డాక్టర్ రామ్మోహన్‌చౌదరి పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత నాయకులు శ్రీధర్‌నాయుడు, పేరూరు అప్పర్‌పెన్నార్ డ్యాం చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, ఉప సర్పంచ్ గంగాధర, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఆగిపోయిన మరుగుదొడ్ల నిర్మాణ పనులు

మరుగుదొడ్లు లేక..!

బూదగవిలో రెండేళ్లుగా విద్యార్థుల పాట్లు

ఉరవకొండ, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో 120 మంది విద్యార్థులు ఉన్నారు. రెండేళ్ల క్రితం నాడు-నేడు కింద నాటి వైసీపీ ప్రభుత్వం మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టింది. అయితే నిధులు పూర్తిగా మంజూరుచేయకపోవడంతో ఆ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో విద్యార్థులు ఆరు బయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

పదేళ్లకే శిథిలమైన వెలుగు భవనం

సమావేశాలు నిర్వహించడానికి జంకుతున్న మహిళలు

కణేకల్లు, జూలై 30(ఆంధ్రజ్యోతి): స్థానికంగా పదేళ్ల క్రితం నిర్మించిన వెలుగు కార్యాలయ భవనం అప్పుడే శిథిలావస్థకు చేరుకుంది. భవన పునాదులు, గోడలు నెర్రెలు చీలాయి. కార్యాలయం లోపల బండలూ కుంగిపోయాయి. ప్రతి రోజూ మహిళలు ఈ భవనంలో సమావేశాలు నిర్వహిస్తూ ఉంటారు. ఎప్పుడు ఈ భవనం కూలుతుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాటి కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే భవనానికి ఈ దుస్థితి ఏర్పడిందనే ఆరోపణలున్నాయి.





నెర్రెలు చీలిన పునాదులు, గోడలు, కార్యాలయంలో కుంగిన బండలు

వాసాపురంలో నీటికష్టాలు

పదిరోజులైనా పట్టించుకోని అధికారులు

యల్లనూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాసాపురం గ్రామస్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో ఎగువ, దిగువ ప్రాంతాలకు రెండు మోటార్లతో తాగునీటిని సరఫరా చేసేవారు. ఎగువ ప్రాంతానికి సంబంధించిన మోటార్ పది రోజుల క్రితం చెడిపోయింది. దీంతో తాగునీటి కోసం ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారు. బుక్కాపురం గ్రామపంచాయతీ సెక్రటరీ ఈ పంచాయతీకి ఇన్‌ఛార్జిగా ఉన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై ఈఓఆర్‌డీ మనోహర్‌ను వివరణ కోరగా ఈ సమస్య తన దృష్టికి వచ్చిందని, మోటార్‌కు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



నీటి కోసం చిన్నారులు, వృద్ధుడి పాట్లు

న్యూస్ బాక్స్



కరపత్రం అందజేస్తున్న విప్ కాలవ

ప్రభుత్వ పథకాలపై విప్ ప్రచారం

రాయదుర్గం, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 26వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు బుధవారం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌ఛార్జ్ ఇనాయత్ బాషా పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు అమ్మితే షాపు సీజ్ : జేడీఏ

కణేకల్లు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయించే ఫర్టిలైజర్ దుకాణాలను సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని వ్యవసాయశాఖ జేడీఏ ఉమామహేశ్వరమ్మ హెచ్చరించారు. స్థానిక ఆదర్శ సొసైటీ బ్యాంకులో రైతులకు సరఫరా చేసిన యూరియా రికార్డులను బుధవారం ఆమె పరిశీలించారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా రైతులకు 26 వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామని, రైతుల డిమాండ్ బట్టి యూరియను కొరత లేకుండా అందిస్తామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్క్‌సెడ్ డీఎం పెన్నేశ్వరి, ఏఓ జగదీష్, సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌గుప్తా, మాబుసాబ్, తిప్పేస్వామితో పాటు సొసైటీ కార్యదర్శులు సతీష్, హనుమంతు పాల్గొన్నారు.

నానో యూరియా వాడండి

బొమ్మనహాళ్ : రైతులు నానో యూరియా, నానో డీఏపీ పట్ల ఆసక్తి చూపాలని జేడీఏ ఉమామహేశ్వరమ్మ సూచించారు. బుధవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో వ్యవసాయ సహకార సొసైటీని ఆమె తనిఖీ చేశారు. యూరియా కొరత ఉందని, తమకు ఇవ్వడంలో జప్యం చేస్తున్నారని కొందరు రైతులు ఆమెకు ఫిర్యాదు చేశారు. జిల్లాలో యూరియా కొరత లేదని, ప్రతి రైతుకు యూరియా అందిస్తామని తెలిపారు. వ్యవసాయాధికారుల సూచన మేరకు ఎరువులు వాడాలని, యాజమాన్య పద్ధతులో పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని సూచించారు.

తీరిన తాగునీటి సమస్య

పెద్దవడుగూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవడుగూరు గ్రామంలో తరచూ తాగునీటి సమస్య తలెత్తుతోంది. దీంతో ఆ గ్రామానికి చెందిన విశ్రాంత టీచర్ ఈశ్వరప్ప సొంత డబ్బు రూ. 20 వేలతో ట్యాంక్ ఏర్పాటు చేశారు. దాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. తాగునీటి సమస్యను పరిష్కరించినందుకు గ్రామస్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఈశ్వరప్ప

నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలి

గుత్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పోలీసులు తప్పుడు కేసుతో అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకున్న టీడీపీ కార్యకర్త నవీన్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని సూర్యవంశ వడియ రాజుల సంఘం, వడ్డెర్ల సంఘం నాయకులు, టీడీపీ నాయకులు కోరారు. స్థానిక అర్‌అండ్‌బీ అతిథిగృహంలో బుధవారం వారు మాట్లాడారు. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం రాజనోళ్లపల్లికి చెందిన నవీన్‌పై రాజకీయ దురుద్దేశంతో పోలీసులు తప్పుడు కేసు బనాయించి.. అతడిని కొట్టి మానసికంగా ఇబ్బందులకు గురిచేశారని, దీంతో మనస్థాపం చెందిన నవీన్ ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మారుతి ప్రసాద్, మండల అధ్యక్షుడు హనమంతు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

కూడేరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసే ముందు భూసార పరీక్షలు చాలా అవసరమని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మలత సూచించారు. బుధవారం కూడేరులోని రైతు సేవా కేంద్రంలో నేల పోషకస్థితి ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు లలితమ్మ, ఏఓ శుభకర్ పాల్గొన్నారు.

కుక్కల బెడద తప్పించండి

గుత్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కుక్కలు, కోతుల బెడద అధికంగా ఉందని, సమస్యను పరిష్కరించాలని సభ్యులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బుధవారం కౌన్సిల్ సాధరణ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో సభ్యులు మాట్లాడుతూ.. కాలనీలో పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇందులో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ జబ్బర్‌మీయా, డీఈఈ హేమచంద్ర, మేనేజర్ రాంబాబు, టీపీఎస్ మారుతిప్రసాద్ పాల్గొన్నారు.

పైప్‌లైన్‌ను పరిశీలించిన డీఈ

పుట్లూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులాపురంలో జేసీ నాగిరెడ్డి తాగునీటి పైప్‌లైన్‌ను ప్రాజెక్ట్ డీఈ రాంగోపాల్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ పనుల్లో అవినీతి జరిగిందని కొందరు రైతులు స్పందనలో చేసిన ఫిర్యాదు మేరకు ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

రహదారి కోసం సర్వే

కణేకల్లు, జూలై 30(ఆంధ్రజ్యోతి): స్థానిక చంద్రబాబునాయుడు కాలనీ వద్ద నిర్మించిన సబ్ మార్కెట్ యార్డుకు రహదారి ఏర్పాటు కోసం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంతరెడ్డి, డైరెక్టర్ చాంద్ బాషా, కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. ఇందులో టీడీపీ నాయకులు ఆనంద్‌రాజ్, బీటీ రమేష్, మాబుసాబ్, ఈరప్ప, వీఆర్వో పవన్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల అందజేత



కుట్టుమిషన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే, ఐటీసీ అధికారులు

గుంతకల్లు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కనదొడ్డి గ్రామం వద్ద ఐటీసీ, నాక్ సంస్థల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద ఐటీసీ నక్కనదొడ్డి పంచాయతీలోని నాలుగు గ్రామాల మహిళలకు నాక్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఐటీసీ ఈడీ పీయూష్ మిట్టల్, చీఫ్ జనరల్ మేనుజరు సురాజ్ కుమార్ పట్నాకయ్ వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతూ.. పంచాయతీ అభివృద్ధికి ఐటీసీ కృషి చేస్తుందన్నారు.

5న విద్యుత్ చార్జీలపై ధర్నా



ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాంభూపాల్

గుంతకల్లు టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల నిలువు దోపిడీని అరికట్టాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని స్థానిక ఆలూరు రోడ్డులోని ఏడీఈ కార్యాలయం వద్ద వచ్చే నెల ఐదో తేదీన ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ తెలిపారు. స్థానిక తిలక్ నగర్‌లో బుధవారం అందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. అదానీ కంపెనీ రాష్ట్రంలో రెండు కోట్ల మంది వినియోగదారులకు పాత మీటర్లు తొలగించి కొత్త స్మార్ట్ మీటర్లను బిగిస్తోందని, ఇది విద్యుత్ సంస్థను ప్రైవేటీకరణ చేసే కుట్రలో భాగమేనని మండిపడ్డారు. వచ్చే నెల తలపెట్టిన ధర్నాలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

విడపనకల్లు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలోని ఉండబండ వీరభద్రస్వామి రథోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వార్ల కల్యాణం వైభవంగా సాగింది. సాయంత్రం నిర్వహించిన వీరభద్రస్వామి రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

తొమ్మిది పంపుల ద్వారా జలాలు

వజ్రకరూరు(ఉరవకొండ), జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగులపాడు వద్ద ఉన్న హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం నుంచి తొమ్మిది పంపుల ద్వారా జీడీపల్లి జలాశయ కాలువకు నీటిని ఎత్తి పోస్తున్నారు. మూడు రోజుల నుంచి ఎనిమిది పంపులతో నీటిని ఎత్తి పోయగా, బుధవారం ఉదయం తొమ్మిది పంపుల ద్వారా కాలువకు నీటిని వదిలారు. కాలువలో 2,624 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని ఈఈ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. కర్నూల్ జిల్లా నుంచి మూడు వేల క్యూసెక్కులకు పైగా నీరు వస్తోందన్నారు. దశల వారిగా 12 మోటర్ల ద్వారా నీరు ఎత్తి పోయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

రైల్వేకు భద్రతే ప్రాణం

గుంతకల్లు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రైల్వేకు భద్రతా అంశమే ప్రాణాధారమని గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీలో జరిగిన మల్టీ డిసిప్లినరీ డివిజనల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను డీఆర్ఎం సందర్శించారు. అక్కడి స్టేషన్ మేనేజర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లతో ఆయన మాట్లాడుతూ.. భద్రత అనే అంశానికి రైల్వే శాఖాధికారులు, సిబ్బంది ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. ప్రయాణికులతో స్నేహపూర్వక సంబంధాలను నిర్వహించాలన్నారు.

పంటల బీమా దరఖాస్తుకు నేడే ఆఖరు

గుంతకల్లు టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పంటల బీమా దరఖాస్తుకు గురువారం చివరి రోజు అని, రైతులు తక్షణమే పంట బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి డీ లీనా వసుంధర తెలిపారు. మండలంలోని కొంగనపల్లి, శంకరబండ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుదాం..!

బెళుగుప్ప, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడమే సుజల, సాహస్ ఫౌండేషన్ల ధ్యేయమని వాటి ప్రతినిధులు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆ రెండు ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ఘన వ్యర్థ నిర్వహణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సాహస్ ప్రాజెక్టు మేనేజర్ నగేష్, సుజలన్ మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ... ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వంతో కలసి వెళతామన్నారు. ఇందులో ఈఓఆర్డీ శివరంజని, ఎంపీపీ పెద్దన్న, టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షురాలు పెద్ద తిప్పయ్య సర్పంచ్ సాలిబాయి పాల్గొన్నారు.



కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కాలువ పనుల పరిశీలన

పెద్దవడుగూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): నార్త్‌కెనాల్‌లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో పాటు పూడిక పేరుకుపోయింది. దీంతో చివరి ఆయకట్టు రైతులకు నీరు అందేది కాదు. దీంతో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తన సొంత నిధులతో పిచ్చిమొక్కలు, పూడిక తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ దివాకర్‌రెడ్డి, రమేష్‌యాదవ్, నాగేశ్వర్‌రెడ్డి, దస్తగిరి ఉన్నారు.

నోరు అదుపులో పెట్టుకో..!

వైసీపీ బహిష్కృత కౌన్సిలర్‌కు ఛైర్‌పర్సన్ వార్నింగ్



మున్సిపల్ ఛైర్‌పర్సన్, కౌన్సిలర్ వాగ్వాదం

రాయదుర్గం, జూలై 30(ఆంధ్రజ్యోతి): 'ఏం మాట్లాడుతున్నావ్.. నోరు అదుపులో పెట్టుకో..' అంటూ మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప.. కౌన్సిల్ మీట్‌లో వైసీపీ బహిష్కృత కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో హెచ్చరించింది. బుధవారం పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. పట్టణంలో రూ.మూడు కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టకుండా వైసీపీ కౌన్సిలర్లు అడ్డుకోవడం దుర్మార్గమని కౌన్సిలర్లు ప్రశాంతి, పద్మజ మండిపడ్డారు. దీంతో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఇంతలో నాల్గవ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి పనులను ఎంపిక చేసే విషయంపై ఏకవచనంతో ఛైర్‌పర్సన్‌ను ప్రశ్నించారు. దీనిపై మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆక్రోషంతో ఊగిపోయారు. మహిళల పట్ల గౌరవంగా సంబోధించడాన్ని ముందు నేర్చుకోవాలని హితవు పలికారు. ఇరువురి మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఒకానొక సమయంలో శిల్ప.. తన నేమ్ ప్లేట్ బోర్డును నేలపై విసిరి అసహనం వ్యక్తం చేశారు. శ్రీనివాస్‌రెడ్డి కూర్చున్న స్థానానికి వచ్చి.. వాగ్వివాదానికి దిగారు. చివరకు పోలీసులు వచ్చి శ్రీనివాసరెడ్డిని అక్కడి నుంచి పంపడంతో వివాదం సద్దుమణిగింది.

సత్యసాయి రథానికి ఘన స్వాగతం



బెళుగుప్పలో శ్రీ సత్యసాయి ప్రేమవాహిని రథోత్సవం

బెళుగుప్ప, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శ్రీ సత్యసాయి బాబా ప్రేమ ప్రవాహిని రథానికి సేవా సమితి సభ్యులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో బుధవారం స్వాగతం పలికారు. సేవాదళ్ సభ్యులు, భజన మండలి సభ్యులు, చిన్నారులు కోలాటాలు, సాయి కీర్తనలతో ఊరేగించారు.

నీటి విడుదల

వజ్రకరూరు(ఉరవకొండ), జూలై 30(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని చాయాపురం హంద్రీనీవా 165 కిలోమీటర్ వద్ద అధికారులు, రైతులు తూములకు నీటిని బుధవారం విడుదల చేశారు. ఈ తూము ద్వారా 10 గ్రామాలకు సాగునీరు అందుతుంది. ఇందులో హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ శ్రీనివాస్ నాయక్, ఏఈ సురేష్ నాయక్, మా జీ ఎంపీపీలు ప్రతాప్‌నాయుడు, వెంకటమ్మ, టీడీపీ నాయకులు మారయ్య, నాగభూషణం, ఎర్రిస్వామి, వలి, మనోహర్, భీమలింగ, దేవేంద్ర, గడేకల్లు శ్రీన, నాగన్న పాల్గొన్నారు.



తూము వద్ద పూజలు చేస్తున్నఅధికారులు

సంత్ సేవాలాల్‌కు ప్రత్యేక పూజలు



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

గుత్తిరూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): చేర్లోపల్లి పంచాయతీలోని సేవాఘలో వెలసిన సంత్ సేవాలాల్ మహారాజ్‌కి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ట్రస్టు అధ్యక్షుడు జగనాథరావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్ సభ్యులు కలసి మహాబోగ్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రంజిత్ నాయక్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు అర్పించారు. ప్రొఫెసర్ గోనా నాయక్ భారతీయ గిరిజన వీరులు, సుగాలి సంస్కృతి భాష, సాహిత్యాలు భాష, కవిత, రచించిన నాలుగు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు అశ్వర్థనాయక్, శేఖర్ నాయక్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

వీధికుక్కల దాడిలో 12 మేకల మృతి



గుమ్మఘట్ట, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురంలో బుధవారం వేకువజామున వీధికుక్కల దాడిలో హరిజన ఓబిలేసుకు చెందిన 12 మేకలు మరణించాయి. ఎప్పటిలాగే ఓబిలేసు గ్రామ సమీపంలోని పాకలో మంగళవారం రాత్రి తన 12 మేకలను తోలి ఇంటికి వెళ్లాడు. బుధవారం వేకువజామున వెళ్లి చూడగా.. వీధి కుక్కలు ఆ పాకలోకి దూరి.. మేకలను చంపి తింటున్నట్లు గుర్తించారు. కేకలు వేసి వాటిని తరిమి చూడగా.. మేకలన్నీ చినిపోయి ఉన్నట్లు గుర్తించాడు. దాదాపు రూ.లక్షకుపైగా నష్టం వాటిల్లిందని ఆయన విలపించాడు. గుమ్మఘట్ట పశువైద్యాధికారి నవీన్ కుమార్ తన సిబ్బందితో వెళ్లి వాటికి పోస్టుమార్టం జరిపించారు.

ఒంగోలు జాతి ఆవు మృతి

వైద్యురాలి నిర్లక్ష్యమే కారణమని వాపోతున్న బాధిత రైతు

పెద్దవడుగూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీముని పల్లి గ్రామానికి చెందిన రైతు పురుషోత్తంరెడ్డికి చెందిన ఒంగోలు జాతి ఆవు ఈత కట్టింది. నెలలు కావడంతో ఎలాంటి పశుగ్రాసమూ తినడంలేదని పురుషోత్తంరెడ్డి మూడు రోజుల క్రితం కిష్టిపాడులోని పశువైద్య కేంద్రానికి వెళ్లి డాక్టర్ కమల వద్ద వాపోయాడు. అయితే తాను ఆ ఊరికి రాలేనని, ఆవు పరిస్థితి ఫొటోలు తీసి పంపిస్తే.. వాటిని చూసి మందులు రాసిస్తాను చెప్పారు. గతేడాది ఇలాగే తన ఆవు ఒకటి మరణించిందని, ఇప్పుడు కూడా ఈ ఆవు మరణించే అవకాశముందని, వైద్యం చేయాలని పురుషోత్తంరెడ్డి ప్రాధేయపడ్డాడు. వైద్యురాలు నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో చేసేదేమిలేక పురుషోత్తంరెడ్డి వెనుదిరిగాడు. ఆవు ఆరోగ్యపరిస్థితి విషమించడంతో మంగళవారం అర్ధరాత్రి మరణించింది. దీంతో రూ.లక్షల విలువజేసే ఆవును తాను కోల్పోయానని పురుషోత్తంరెడ్డి వాపోతున్నాడు. గ్రామీణ రైతులకు పశువైద్య అధికారులు అందుబాటులో ఉండటం లేదని, దీంతో మండలంలో అనేక పశువులు మరణిస్తున్నాయని పాడి రైతులు వాపోతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

యాడికి, జూలై30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాడు వద్ద జాతీయ రహదారిపై ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని, ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

జూదరుల కోసం గాలింపు

యాడికి, జూలై 30(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా అవుకు మండలంలోని కంబగిరిస్వామి ఆలయ పరిసరాల్లో పేకాట ఆడిన యాడికి వాసుల కోసం అవుకు పోలీసులు ఇక్కడి మూడు రోజులుగా గాలిస్తున్నారు. యాడికి చెందిన కొంతమంది పేకాటరాయుళ్లు కంబగిరిస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న వీడియోలు, ఫొటోలు అవుకు పోలీసులకు చేరడంతో వాటి ఆధారంగా ఈ గాలింపు చర్యలు చేపట్టారు. మొత్తం 14 మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించారని, వీరిలో ఎనిమిది మందిని ఇప్పటికే అరెస్ట్ చేశామని, మిగిలిన వారి కోసం గాలిస్తున్నామని ఆ పోలీసులు చెప్పారు. వీరిపై పేకాట ఆడుతున్న కేసుతో పాటు సారా కేసు నమోదు చేసినట్లు సమాచారం.

కేబుల్ చోరీ

పుట్లూరు, జూలై30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడ్డిపల్లిలో బుధవారం ఏడుగురు రైతులకు చెందిన పొలాల్లోని సుమారు 140 మీటర్ల కేబుల్‌ను దుండగులు చోరీ చేశారు. పోలీసులు ఆ పొలాలను పరిశీలించారు. ఇప్పటివరకు చోరీపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుల అరెస్ట్

యాడికి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడులో బెల్ట్‌షాపు నిర్వాహకుడ్ని అరెస్ట్ చేసి అతని వద్ద ఉన్న 10 క్వార్టర్ మద్యం బాటిళ్లను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే నిట్టూరులో మరో బెల్ట్‌షాప్ నిర్వాహకుడ్ని అరెస్ట్ చేసి 15 క్వార్టర్ మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఆరుగురు జూదరులు..

శెట్టూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లి గ్రామ పొలాల్లో మంగళవారం రాత్రి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి రూ. 24200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామని, పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలిస్తున్నామని తెలిపారు.

హత్య కేసులో మరో నిందితుడు..

తాడిపత్రి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాల్వగడ్డవీధిలో ఈనెల 14న హర్ష అనే వ్యక్తి హత్యకు గురైన విషయం తెల్సిందే. ఈ కేసులో బుధవారం మరో నిందితుడు శివమహేష్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

ఇద్దరు మట్కాబీటర్లు..

తాడిపత్రి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు క్రాస్ వద్ద బుధవారం ఇద్దరు మట్కాబీటర్లను అరెస్ట్ చేసి.. వారివద్ద నుంచి రూ.1,01,770 నగదు, మట్కాచిట్టీలు స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ముస్లిం మైనార్టీ కమిటీ ఏర్పాటు

గుత్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీ పట్టణ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా రియాజ్ సాహెబ్, దస్తగిరి, ఉపాధ్యక్షులుగా సికిందర్, అన్వర్ ఖుర్షీ, డిష్ అన్వర్, కోశాధికారిగా నజీర్ సాహెబ్, గౌరవ సలహాదారుగా ఇస్మాయిల్, లీగల్ అడ్వైజర్‌గా ఎస్ఎండీ ఇస్మాయిల్, గౌరవ అధ్యక్షులుగా జిలాన్, రసూల్, అబ్దుల్, అబుబకర్, రఫీ, సహాయ కార్యదర్శులుగా నూర్‌నాయక్, అజీజ్‌బాషా ఎన్నుకున్నారు.